ఆంధ్రభూమి
సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.
సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

సంపుట : ౯. వృష, ఆషాఢము : జూలై, 1941. సంచిక : ౯.

స్వాతంత్ర్యప్రియుడు చర్చిల్

సూర్యుడస్తమించని విశాల బ్రిటిష్ సామ్రాజ్యానికి నేడు సూత్రధారుడై, విజయవాంఛతో దేశమును ఏకగ్రీవముగా తన వెనుక నడపుకొనుచు హిట్లరువంటి అజేయ శత్రువును ఎదురొడ్డి నిలిచిన, సాహసోపేతుడు విన్‌స్టన్ చర్చిల్. సాహసమే జీవితవిన్యాసముగా గల శూరుడు. అతని సాహసగుణం బోయర్ యుద్ధంలోనే ప్రస్ఫుటమైంది—

బోయరు యుద్ధంలో అతడు పట్టుబడ్డాడు.

ఇతరసైనికులతోపాటు అతన్ని కూడ ప్రిటోరియా జైయిల్లో పెట్టారు. పత్రికావిలేఖరి అన్న సాకు చెప్పి విడవమని కోరాడు. కాని పత్రికా విలేఖరి ప్రవర్తింపవలసిన విధంగా ప్రవర్తింపక ఆ యుద్ధంలో సాయుధభటులతో కూడిన రైలును సురక్షితంగా వెనక్కుపంపినవీరుడు చర్చిల్ అని లోకం కోడై కూస్తోంటే వారు ఎట్లా విడుస్తారు. కాగా జైలునుండి తప్పించుకు పోవడానికి ఎత్తువేసాడు.

జైలునుండి తప్పించుకోన ప్రయత్నించి పట్టుబడిన తనకు కలిగే పరాభవ ఫలితం ఎంతటి భయంకరంగా వున్నా జైలులో వుండే కన్నా అదే మంచిదని నిర్ణయించుకున్నాడు. జైలు జీవితం అతనికి అసహ్యమనిపించింది.

1899 నవంబరు 18-వ తేదీని ప్రిటోరియా జైల్లో పెట్టారు. యుద్ధఖైదీలకై ప్రత్యేకింపబడిన మోడల్‌స్కూలు మందిరంలో విడిది — చర్చిల్‌కు, యితర సేనానులకున్ను.

బందెల దొడ్డిలో పశువులను పెట్టినట్టు పెట్టారు యీ సైనికోద్యోగులను. కాని వారందరూ కలసి, తప్పించుకు పారిపోవడానికి మార్గాలు యోచించేవారు రాత్రింబవళ్ళు ఒకసారి రాత్రివేళ దీపాలు ఆరిపేసి కాపలా కాస్తున్న వారిమీద అమాంతంగాపడి వారి ఆయుధాలు లాక్కుందామని పన్నుగడ పన్నారు. కాని అది కొనసాగే విధానం కనుపించలేదు. అందరూ కలసి తప్పించుకుపోయే విధానం సులభసాధ్యం కాదని ఆ యోచన విడిచిపెట్టి ఎవరిమట్టుకు వారు తప్పించుకుపోయే ఎత్తులు వేయసాగారు.

డిసెంబరు 12-వ తేదీని సాయంకాలం శిబిర రక్షణాధికారులు వెనుతిరిగి ఎవరితోనో ముచ్చటించేసమయంలో గోడదూకినాడు చర్చిల్. తనతో ఆలోచించినవాళ్ళుకూడా వస్తారనే ఆశతో ఆగోడ ప్రక్కనున్న తోటలోని పొదల్లో దాక్కొని కొంతతడవు. వేచివున్నాడు తక్కినవారెవరూ రాలేదు. అతన్నికూడా మరల తిరిగి లోపల

రచయిత.

కొత్తపల్లి శ్రీరామమూర్తి

కు వచ్చేయమని సంజ్ఞలు చేసారు గోడదగ్గరనుండి. యువతలకు వారు చూడకండా రాగలిగాడు కాని తిరిగి గోడ ఎక్కుతూవుంటే వాళ్లు ఎల్లాగా చూస్తారు ప్రమాదం తప్పదని. ఏమైనాసరే నాదారి నేను చూచుకుంటానని చెప్పాడు చర్చిల్. ఆ పొదల్లో కొంత తడవు దాగివుండి బాగా చీకటిపడిన వెనుక ఆజైలు గుమ్మంముందునుంచే పిల్లిలాగ పోయాడు, పరుగెత్తమని హృదయం తొందరపెట్టినా పరుగెత్తుతే అనుమానంమీద ఎవరైనా వెంటాడతారన్న భయంచేత దడదడలాడే గుండెతో బింకంగా నడిచిపోయాడు. నూరుగజాలు గడిచిపోయాక ఒక వంతెన కనుపించింది. దానిమీద కూర్చుని భావి కర్తవ్యమేమా అని తలపోసికొన్నాడు.

ఆ ప్రదేశమంతా శత్రువులది. తెల్లవారితే చర్చిల్ తప్పించుకుపోయాడన్నవార్త దేశంలో జలతైలబిందువై పాకిపోతుంది. పట్టుకోడానికి శత్రువులు ప్రయత్నిస్తారు. దారీ తెన్నూ గోచరంకావడం లేదు. అతడు అప్పట్లో వూదారంగు దుస్తులు ధరించివున్నాడు. చేతిలో 75 పౌనులు మాత్రమే వున్నాయి. నాలుగు చాక్‌లెట్లులు కూడా వున్నా. తక్కిన అవసరమైన మాప్, కాంపస్ తనతో కూడా వస్తానన్న స్నేహితుని జేబులో పెట్టాడు.

ప్రాణంమీద ఆశ లేనప్పుడు భయమేంవిటి ? అక్కడ వున్న డచ్చివారి నెవరినైనా కలసికొని ఆశ్రయంకోరాలనుకున్నాడు. కాని ఆభాషరాదు. చర్చిల్‌కి కడుపుగో ఆకలిమంట ఆదుర్దా, ఏంచేయడానికి తోచిందికాదు. భగవంతునిపై భారంవేసి ముందుకి సాగాడు. ఒక అరమైలు వెళ్ళేసరికి ఒక రైలుమార్గం కనుపించింది అది ఎక్కడకు పోయేదో తెలియలేదు. శత్రువులబారినుండి తప్పించుకోవాలంటే అల్‌గోవాబే చేరాలి.

రాత్రి పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. చల్లని గాలులు వీస్తున్నాయి. కొంచం ప్రాణం తేరుకున్నట్లు అయింది, ఆ వాతావరణంలో చర్చిల్‌కి. ఉత్తరాభిముఖుడై రైలు బద్ది వెంబడినే నడచాడు.

దారులన్నీ సైనికులచే రక్షింపబడుతున్నాయి. కాలినడకమీద 300 మైళ్లు నడచి శత్రు దేశంనుండి బయటపడటమంటే సామాన్యమైన పనికాదు. కాగా ఏదేనా రైలు ఎక్కి సీటుక్రిందో, టాపుమీదో దాక్కునిపోవాలనుకున్నాడు చర్చిల్. అదీ కాకపోతే పెట్టికి పెట్టికి మధ్యనుండే కప్లింగుమీద కూర్చునైనా పోవాలనుకున్నాడు. స్వేచ్ఛకై ఎట్టిపని చేయడానికైనా వెనుదీయని దిట్ట అతడు.

అలా అనుకుంటూ నడిచేసరికి ఒక ప్లాట్‌ఫారమ్ కనుపించింది. అక్కడ ఒకరైలుపోవడానికి సిద్ధంగావుంది. సరే అది కదిలిన వెనుక దానిమీద ఉరికి ఎక్కాలనుకుని స్టేషనుకి కొంచం దూరంలో గొయ్యివుంటే ఆగోతిలోపొంచిఉన్నాడు. రైలు జోరుగా సాగింది. యింజను దాటగానే దాన్ని సమీపించి ఏదేనా పట్టుకు వ్రేలాడటానికి చూచాడు. ఒకటి రెండు మూడు సార్లు ప్రయత్నించాడు, కళ్లు చీకట్లు క్రమ్ముతున్నాయి. నాలుగోసారి ఏదో చేతికి దొరికింది, దాన్ని పట్టుకు వ్రేలబడి కపిలింగుమీదకు గెంతాడు.

అది గూడ్సుట్రెయిను. కాలీ బొగ్గురంచులను తీసుకుపోతోంది. కాగా పైకి ఎక్కి, ఆ గోనిసంచుల్లో దూరి పడుకున్నాడు వెచ్చగా, బ్రతుకు జీవుడా అనుకుని.

కాసేపు నిద్రపోదామనుకున్నాడు. కర్తవ్యం నిద్రపట్టనిస్తుందా! తెల్లవారితే ఎవరేనా గుర్తించి పట్టుకొనవచ్చునని తెల్లవారకండానే దిగిపోదామన్న తలంపుతో తిరిగి కప్లింగుమీదకు జారాడు. అక్కడనుండి కొంచం మెత్తగా వున్న ప్రదేశంలో క్రిందకు ఉరికాడు. ఆ ఉరకడంలో జారి దొర్లిపోయాడు ఒకగోతిలోకి. పగలంతా ఆ కొండమీది తుప్పలో దాగి ఉన్నాడు.

ఆ కొండలమీద తుప్పలో అతనికి తోడు ఒక రాంబంధు. అది అప్పటప్పట అశుభసూచకమైన అరపులు అరిచేది. సమీపంలో

వున్న వూరు చేరాలనుకున్నాడు. కాని చేరితే ఏం ప్రమాదం మూడుతుందో అన్న భయంచేత సాహసింపలేదు. ఆకలి దహించుకుపోతోంది. అరమైలుదూరంలో ఒక చెరువు కనుపించింది. కాని సమీపింప ధైర్యం లేకపోయింది, పట్టుపడతాడనే భయంచేత. అతను దాగివున్న పొద సమీపంలోనే ఒక బోయరుజాతీయుడు పిట్టలను వేటాడుతున్నాడు. కాని ఈ ఏకాకిని చూడలేదు. ఆకలి మంటచే నిద్రపోదామన్నా నిద్ర పట్టలేదు. చేసేది ఏమీలేక భగవంతుని ప్రార్థిస్తో కూచున్నాడు ఆ పగలంతా. ఆకలిమంట కాగలేక తిండికోసమని ఆశించి నరుని కంట బడితే తిరిగి నరకం ప్రాప్తిస్తుందని ఉన్న చాక్లెట్టులతోనే క్షుధాగ్ని చల్లార్చుకున్నాడు.

ఆ కొండల ప్రదేశంలో మలుపులందు రైళ్లు చాలా నెమ్మదిగా వెళ్ళడం గమనించాడు. ఆరాత్రి తిరిగి యింకో రైలు ఎక్కదలంచుకొన్నాడు. కాని ఆరాత్రి ఎంత సేపు కాచివున్నా ఆ దారిని ఒక్క రైలూ రాలేదు. రాత్రులందు ఆ మార్గాన్ని రైళ్లు పోవని తేలిపోయింది. నడిరేయి 12 గంటలవరకు చూచాడు. లాభం లేదని కాలికి బుద్ధి చెప్పాడు.

రైలుమార్గంలో వున్న వంతెనలను సైనికులు రక్షిస్తున్నారు. కాగా రైలుమార్గాన వెడితే పట్టుపడిపోతాడనే భయంచే ప్రక్కదారుల పడి నడవసాగాడు. దారిలో గోతులు కాలవలు యీదవలసి వచ్చింది.

తిండిలేక, నిద్రలేక నీరసించి పోయాడు నడవలేకపోయాడు. అట్లాగే నడుస్తోండగా సమీపంలో స్టేషను కనుపించింది. మెల్లగా దాన్ని చేరాడు. అక్కడ ఆగివున్న రైళ్ళన్నీ పరిశీలిస్తున్నాడు.

అక్కడ జనుల మాటలు వినబడుతున్నాయి. కాగా దగ్గర వుంటే లాభం లేదని ప్రక్క పొలాల్లోకి పరుగెత్తేడు. కొంతదూరం పోయేసరికి మంటలు కనుపించాయి. అక్కడకు పోయి ఆశ్రయం కోరదలచుకొన్నాడు. కాని ఓపిక లేక కూలబడ్డాడు. హృదయం వూగులాడింది- వెనక్కు వెళ్ళడమా ముందుకు వెళ్ళి నరుని కంట బడటమా అని. ఏమైనా సరే ఆ వెలుగు కనపడే చోటికి పొమ్మని ప్రోత్సహించింది హృదయం.

తెగించి ముందుకుసాగాడు. అక్కడ ఇళ్లు కనుపించేసరికి వెనక్కి పోదామనిపించింది. ఈ నరారణ్యంలో కాలుపెడితే నరకం తప్పదన్న భీతిచేత.

ఆ గ్రామం విట్‌బాంక్, మిడిల్ బర్గు బొగ్గుగనులలో చేరినది. అక్కడ యింగ్లీషువారు ఉన్నసంగతి విన్నాడు. కాగా ధైర్యం చిక్కబట్టి ఒక యింటికి పోయి తలుపు తట్టాడు. 'ఎవరు వారన్న' ధ్వని వినపించింది లోపలనుంచి అతనికి అర్థంగాని ఏదో భాషలో. చర్చిల్ కంగారు పడిపోయాడు. తెప్పరిల్లి 'ప్రమాదంలో వున్నాను ఆశ్రయం కావా'లని అరిచాడు. ఏదో గొణుక్కుంటూ ఆయింటి యజమాని తలుపు తెరచి ఎగాదిగా చూచి లోనికి రమ్మన్నాడు. అంతా చీకటిగా వుంది ఆచీకటిని చీల్చుకొని లోనికి పోయాడు చర్చిల్ మహాశయుడు. దీపంవేసి 'ఏం కావాలని' అడిగాడు యీసారి యింగ్లీషులో. బ్రతుకు జీవుడా అనుకున్నాడు చర్చిలు.

చర్చిలు కొంచం ఆలోచించి మాటాడదలచాడు. ఆ నూతన వ్యక్తితో స్నేహంచేసుకొని ఆ శత్రువులమధ్యనుండి తప్పించుకోదలచాడు, సంగతి ముందే చెబితే గాభరాపడి గోల చేస్తాడనే అనుమానంచేత. తానొక పరదేశి ననీ, ప్రమాదంచేత రైలుమీద నుంచి పడిపోయానని, దెబ్బ వాసిలిపోయిందని ఏదేదో కథగా చెప్పాడు.

అతని కథ సావధానంగా విన్న యింటియజమాని జాలిపడి తలుపు బిడాయించి భోజనశాలకు తీసుకువెళ్లాడు.

అక్కడ టేబిలుకి యిరుపైపులా కుర్చీలు వున్నాయి. కూచున్నారు. 'మీకు కలిగిన ప్రమాదాన్నిగురించి విపులంగా వినగోరు

[మిగతా ౬౯౪-వ పేజీలో.

రూపం దాల్చిన శౌర్యప్రతాపాలే

వాణీవారి

"చంద్రహాస"



మహామంత్రి కావడంతో తృప్తిలేని దుష్టబుద్ధి రాజ కుటుంబాన్ని నాశనంచేసి తనకొడుకును చక్రవర్తిని చేయ దలంచి నడిపిన కథ అంతా అతనికూతురు "విషయ" కంటి కాటుక రేఖా ప్రయోగంతో తలక్రిందులై చంద్రహాసునకే రాజ్యం దక్కుతుంది.

తారాగణం: మాధవపెద్ది, పులిపాటి, రాజారావు, సూర్యకుమారి, బాలసరస్వతి, వేదవల్లి, రమ.

డైరక్షను: N. L. రంగయ్య

కవి: తురగా వెంకట్రామయ్య.

VANI PICTURES,

No 11, Edward Elliots Road, Mylapore, Madras.

పండితులకు మాత్రమే

వాత్స్యాయన కామసూత్రములు

యశోధరుని జయమంగళ వ్యాఖ్యయు, మూలసూత్రములును తేటతెల్లమగు ఆంధ్రవివరణము, విశేషాంశములు, పీఠికతో సహా శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిచే కూర్పబడిన పెద్దసైజున 800 పుటలుగల గ్రంథము- కామపురుషార్థమును గురించిన అన్ని సంగతులు గలవు.

రెండవ కూర్పు – రు 10_0_0 – పోస్టుఖర్చులు ప్రత్యేకము.

గ్రంథము విలువయును, యోగ్యతయును ఆంధ్రదేశమునందలి ప్రతియొక్కరును ఎఱింగియుండుటచేతను దీనిని గుఱించి విశేషించి వ్రాయనవసర ముండదు. విద్వాంసులు, భాషాపారిశ్రామికులు, చారిత్రికాన్వేషణము చేయు సజ్జనులు తప్ప ఇతరుల కెవ్వరికిని ఎంతమూల్యము నొసఁగినను ఈ గ్రంథమును విక్రయించుటగాని, మఱి ఇతరవిధములగాని ఈయము. గ్రంథమును చక్కగా సంరక్షించుకొని దుర్వినియోగమునకుఁ దావీయమని వ్రాతమూలకముగా పూచీనిచ్చువారు మాత్రమే ఈగ్రంథము కొఱకై ఆర్డరులను పంపవలెను. పాఠశాలలు, కళాశాలలు మొదలైనవాటిలో చదువు విద్యార్థులును; స్త్రీలును; గ్రంథమునుగాని, గ్రంథస్థములగు విషయములనుగాని సంరక్షణచేసికొనఁజాలని ఇతరులును ఈ గ్రంథమునకు ఆర్డర్లు పంపవలదు.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

దాసీపిల్ల

'డబ్బు దండిగావుంటే వారు బాగా తినొచ్చు, రోజూ నాలుగుసార్లు సినిమాలు చూడొచ్చు, విలువయిన వలువలు ధరించవచ్చు, మరి చిత్త మెచ్చినట్టు విహరించవచ్చు. ఎవరొద్దంటారు!—కాని, లోకువయినంతమాత్రాన నిర్ధనులైన నిరపరాధుల అసువులను బలిగొనటం యేమంత భావ్యమైనపనీ?— అయితే పేదలతో ప్రభువులు చెలగాటాలాడ్డానికి సంఘం దోహదం చేస్తుంది. ఇంతకీ, వారు ఐశ్వర్యమంతులూ—'

రచయిత :

'బాబుజీ'

మావాడుకదా అనిచెప్పి యీ ధార్ష్ట్యం మరుగుపరచటానికి నాకు మనస్కరించకుండా వుంది. ఆ విషయం నాకిప్పటికీ గుండెల్లో మెదుల్తూనే వుంటుంది.

'లా' చదువుకోసం మావాడు కుటుంబసహితంగా తిరువాన్కూరు వెళ్లాడు, ఆ సంవత్సరం.

మలయాళీ దేశంలో మహా చక్కటి పిల్లలుంటారని అంతకు ముందు వింటూవచ్చాడు మావాడు. ఈ చదువు అక్కడ సాగించటంలో మలయాళీ పిల్లల్నికూడా ఒకచూపు చూడవచ్చుననేది అతగాని మనస్సులోని వుద్దేశాల్లో ఒకటైతే ఐవుండొచ్చు.

కాపురం అంటూ పెట్టాక పనిమనిషి ఉండక తప్పదుకద! మా వాళ్ళ అదృష్టంకొద్దీ ఒక నీటయిన నిండు పదహారేళ్ళ జవ్వని కొలువుకి కుదురుకుంది. ఆ పిల్ల రూపవతి మాత్రమే కాదు. ఆమె నాల్గవ ఫారంవరకూ చదువుకున్న విద్యావతి. పేరు 'జలజ'.

వృత్తి యేదయినా నిజాయితీ ప్రధానమైన జాతి అది. అంతే కాని చేసే పనికి నైచ్యతను ఆపాదించే గుణం లేదు వాళ్ళకి, అంచేతనే, ఒకరింట్లో పనిమనిషిగా కుదరటానికి అంత చదువుండికూడా ఆ వయసులో సందేహించనే లేదు జలజ.

ప్రవేశించింది మొదలుకుని, ఆ యింటిలో ఒక తెగా మెలగుతూ, మావాళ్ళకి ఆడపిల్లల్లేని లోపం తీర్చింది.

జలజ తల్లి శతవృద్ధు. ఆమె చెన్నాపట్టంలో ఒకరింటదాది.

*　　*　　*

చెప్పొద్దూ!—

మావాళ్లు మంచి ఐశ్వర్యవంతులు.

గొప్పవాళ్లు.

శ్రీమంతులు.

సామంతులు.

పెద్దయింటివాళ్లు.

వాళ్ళ ఐశ్వర్యమదానికి విరుగుడు అగుపడదు. వాళ్ళ నిరంకుశతను 'నిమ్మకు నీరోసినట్లు' సాగనిస్తుంది నీతిమాలిన సంఘం.

వాళ్లు మత్తెక్కి చేసే వికారపు చేష్టలన్నిటికీ జేజేలు కొడుతుంది కాసుకి ఆశపడే పాడులోకం.

'కో' అంటే కోటిమంది బలగం. వాళ్ళ పలుకుబడి మేరలేనిది. వాళ్ళేమన్నా చెల్లిపోతుంది, ఏం చేసినా పరిసిబారిపోతుంది. వాళ్ళ కత్తికి అడ్డులేదు. వాళ్ళమాటకి తిరుగులేదు. ఇంతకీ, వాళ్లు ఐశ్వర్యవంతులూ...

*　　*　　*

అమ్మగారి మొహం అస్తమానం ధుమధుమలాడుతూనే వుంటుంది. అందులోనూ మొత్తని వాళ్ళని చూస్తే ఆవిడకి మరీ [illegible] పొద్దుబ్బున్నుంచీ ఆమె పనిపట్టి ఏదో వెతుక్కుంటూంది.

అతి వినయంతో వచ్చి ఎదట నిలబడింది జలజ.

అమ్మగారు :—ఏం? ఎందుకూ?

"మా అమ్మకి సుస్తీగా వుంది, రమ్మని వుత్తర మొచ్చిందండి. రేపటిరోజున ప్రయాణమండి. జీతం దయచేస్తిరంటే..."

"జీ–తం...! యివ్వక పారిపోతారుకాబోలు..."

"అది కాదండమ్మా..."

"చళ్–భడవా!... రేపిస్తాం, ఫో—"

మొహం దించుకుని వెళ్ళిపోబోతూంది జలజ. అయినా మళ్ళీ ఒక్కసారి అడిగేసి పోదామా అన్నట్టుగా గుమ్మందగ్గిరే కాస్సేపు నిలబడింది. చూసి చూసి వెళ్ళిపోయింది.

ఇంతలో, ఆ తెగ వెతుక్కుంటున్న అమ్మగారు గదంతా తలకిందు చేసి, కలియవెదికి, వస్తువాహనా లుండే పెట్టెవంక ఇట్టె చూసి—

"యేమయిందీ!" అంటూ రంకె వేసింది.

మళ్ళీ బహుశా జలజను వెనక్కి పిలుద్దామా అని కాబోలు, అటు యిటు చూసింది. కాని జలజ వెళ్ళిపోయి చాలాసేపయిన సంగతి గురుతొచ్చి, తీవ్రమయిన ఆలోచనలోపడింది.

* * *

చూస్తే, జీతపురాళ్లు చేతులో పడలేదు. రాత్రిరికి ప్రయాణం పెట్టుకున్నదాయె. ఎట్లారా భగవంతుఁడా అని పరిపరి విధాల యోజిస్తూంది జలజ—ఇంటిదగ్గిర.

ఇంతలో గుమ్మంలో కారు చప్పుడు! స్వాప్నికావస్థనుంచి లేచి, ఆ వచ్చిందెవరో చూడబోయింది. చూస్తే, అమ్మగారే!

"ఆహా, తల్లికి యెంత దయ! కోప్పడినప్పుడు కోప్పడినా ఆపదలో ఆదుకునే మాలక్ష్మి అమ్మగారు గాక మరెవరు. రైలుకెళ్లాలి గదా అనిచెప్పి, జీతం స్వయంగా చేతపట్టుకొచ్చారు గామోసు!..." అని ఈమోస్తరుగా లిప్తకాలంలో జలజకు ఎన్నో ఊటలూరేసినయి.

అమ్మగారి వెంట అయ్యగారు, ఆయన వెంట ఒక పోలీస్ సార్జెంటూ దిగారు. జలజ ఆశ్చర్యానికి మేర లేదు.

అమ్మగారు :— ఇదిగో, ఈ అమ్మాయే.

జలజ బిక్కచచ్చిపోయింది.

"ఏమిటండమ్మా!—" అని అడిగింది, ఏదో మీద పడబోతున్న విపత్తు యొక్క ఛాయల్ని చూస్తూ.

సార్జెంటు:—ఏయ్, అమ్మాయి!—మీ అయ్యవారింట్లో కాసులుపేరు కనబడ్డంలేదు. నువ్వే తీసుండాలని...

'నేనా!.. నేనా... నేను తీశానా!!—' అంటూ జలజ, ఆవేదనతో కూడిన కేక పెట్టింది, అమ్మగారివేపు తిరిగి.

అనుమానంపై ఆమె అరెస్టు అయింది.

నిరపరాధినని ఎన్నివిధాల చెప్పుకున్నా అదంతా అరణ్యరోదనమే అయింది.

'పైవాళ్ళింకెవరొస్తారూ...' అని అమ్మగారు.

అదీగాక, అక్కడ చోరీ పోవడం, ఇక్కడ జలజ ప్రయాణం పెట్టుకోవటం— ఇది అమ్మగారి అనుమానానికి మరీ బలీయమయింది.

సరే, పడింది శిక్ష.

'ఆరుమాసాల కఠినకారాగారం...'

* * *

కొన్ని నెలలయినాక—

ఒకనాడు మావాడు డెయిలీ పేపరు చదువుతూ ఒకదగ్గర కొచ్చే సరికి బిత్తరపోయాడు.

భార్యని పిలిచాడు.

'ఇది చూశావా!'

పత్రికలోని వార్త ఇట్లా చదివారు ఇద్దరున్నూ—

మద్రాసు : 7 మే.

'నేడు ఉదయం ఒక యువతిశవము కూవమ్‌నది పైన తేలినది. ఆమె ఇటీవల ఒక చోరీకేసులో ఆరునెలలు అరెస్టయిన 'జలజ' అనే అమ్మాయిగా పోల్చబడినది. ఆమె జైలునుండి విడుదలయినప్పటినించీ తిండికి లేక ఆత్మహత్య చేసుకున్నట్టు నిశ్చయింపబడినది.'

మావాడు.—అరెరే, ఎంత పని!

అమ్మగారు:— ఆఁ!— అంతా దాని ఖర్మ... (అని బుర్ర అడ్డంగా వూపింది.)

* * *

ఈ ప్రసంగం జరుగుతూ వుండంగానే మావాళ్ల పదేళ్ళబ్బాయి కేరింతాలుకొడుతూ, తళతళ మెరుస్తూవుండే కాసులుపేరు చేతపట్టుకొచ్చాడు. చప్పట్లు కొట్టాడు. పకపక నవ్వాడు. 'దొరికిందోయ్, దొరికింది!' అని కూనరాగాలు తీస్తూ. గంతులేశాడు కూడాను.

'ఎక్కడిదిరా నాయనా!...' అని ఆత్రంతో అడిగారు మావాళ్ళు.

'నే నోనాడు ఆడుకుందికి తీసుకున్నానే అమ్మా. ఆ మర్నాడు ఇది అవుపించలేదే. కొప్పడతారని చెప్పి నేనెవళ్ళతోనూ చెప్పలేదే. తోటలో ఆడుకుంటుంటే ఇప్పుడు తుప్పలో మెరిసిందే అమ్మా...'

'వోరి, నీ కడుపుడకా...' అంటూ పెద్ద నిట్టూర్పు విడిచింది అమ్మగారు.

నిరపరాధిని జలజను బలిగొన్న ఈ కాసులుపేరును చూచి, మావాడు జలజల దుఃఖబాష్పాలు రాల్చాడు.

చచ్చి స్వర్గాన వున్న అమాయికపు జలజకు ఈ తతంగమంతా యేం తెలుస్తుందీ!

* * *

పొట్టకోసం తలమ్మకున్న పరిచారిక. జలజ ఆమెకు డబ్బులేదు, పలుకుబడి లేదు. ఆమె మాటను సంఘం వినిపించుకోదు, ఆమె దారిద్ర్యానికి విరుగుడు లేదు. దారిద్ర్య బాధను ఆమె యిష్టపడి సహించింది. కాని, యింటా ఒంటా లేని దొంగతనం అంటకట్టడంతో ఈ దుష్టప్రపంచం యింతే ననుకున్నది.

తన మాట చెల్లుబడి కావటానికి సావకాశం లేని ఈ లోకంలో తనకు తావులేదని నిశ్చయించింది.

శాస్త్రిలకేం?—రెండు నాలికల శాస్త్రిలు! సమయానుకూలంగా సంచరించే రాజకీయ వేత్తలవంటి ఈ శాస్త్రిలు, ముక్కుకి సూటీగా పోదామనుకున్న జలజ వంటి అమాయికలకు సాయపడవు.

ఈ అన్నిటికీ అతీతమైన రక్షణ ఒక్కటే—మృత్యుదేవత ఒడిలో తలదాచుకోవటం.

ఆ పనే చేసి జలజ ధన్యురాలయింది!

పల్లెపదాలు

[వీనిని సేకరించినది దేవగుప్తాపు వెంకటరమణమూర్తి పంతులు గారు. వీనిని వరి ఊడ్పులలో విశాఖపట్టణం మండలంలోని స్త్రీలు పాడుతారు. 'నోమినోమల్లార నోమన్నలారా చందామామ" అను పల్లవి ప్రతి చరణము తుదిని పాడుతుండాలి.
—సంపాదకుడు.]

మామామ మలిరెడ్డి కొమ్మవేల మోడూ
వెండిగాదెలు ధనంవుండెవరిపాలు॰
పైడిగాదెలధనం పట్టీలపాహూ
గోడ్డోరిధనమోలీ గోలేలతోటీ
వెండిగాదెలమీదాయిందువులవారీ
పైడిగాదెలమీద పచ్చలోరేనూ
మామామ మలిరెడ్డి కొమ్మవెల మోడూ
తోటవేయించితే మాటలుంటాయీ
చెర్లు దీయించీతే చెప్పుకుంటారూ
మాతులూతీయిస్తేనూరుపుణ్యాలూ
మామామ మలిరెడ్డి కొమ్మవెల మోడూ
ఏడుగురు కొడుకుల్ని కన్నమలిరెడ్డి
ఏడుగురు కోడల్ని ఏలె మలిరెడ్డి
అందరికి చిన్నాదీ ముద్దుమల్లమ్మా
మూనాలు పురటాలూ ముద్దు మల్లమ్మా
కోడలన్నామాటా మామాలకించీ
నామామ మలిరెడ్డి కొమ్ములెల మోడూ
ఊరూరి బ్రాహ్మర్ల పిలిపించినాడూ
తానూరి బ్రాహ్మర్ల పిలిపించినాడూ
చదుల్లు తుడిపించి చాపవేయించీ
వచ్చెనే బ్రాహ్మర్లు గ్రామంబులోకీ
చదుల్లుమీద బ్రాహ్మర్లు కూరుచున్నారూ
చంక పుస్తకాలూ జబ్రూన దీసి
మునివ్రేళ్ళ గ్రంధాల ముళ్ళిప్పినారూ
వేదపురాణాలు చదువుతున్నారూ
కడనుంచి వారెల్ల కొడివరకుజదివీ
మంచిముహూర్తాన్ని ఎంచిపడికట్టీ
మంగళారంనాడూ పంచమీనాడూ
ఆదివారంనాడూ అష్టమీనాడూ
దశమి దశమీనాడూ ద్వాదశీనాడూ
శుక్రవారమునాడూ చక్కన్నరోజూ
ఆదివిలి కట్టాలు కష్టేశినారూ
ఆవేదబ్రాహ్మర్లు వెళ్ళిపొయ్యేరూ
కోడలా కోడలా కోడలామల్లూ
తబుకుతోవరహాలూ తవ్వితెచ్చిందీ
ఎవరెవరి కట్నాలూ యిచ్చేశినాదీ
ఎడమూట పెడమూటాకట్టి బ్రాహ్మర్లూ
మడమెత్తి పరుగూనా వెళ్ళిపొయ్యేరూ
అప్పుడేమీపనులూ మామమలీరెడ్డీ
శుక్రవారమునాడూ చక్కన్న రోజూ
చుక్కదూరీనపుడూ బయళెల్లినాడూ
ఆపెద్ద కొడుకునీ తెలుపుతున్నాడూ
కొడుకురా ఓకొడుక కొడుక రామన్నా
యల్లకోస్తాలురా ఎంచిపూశేడూ
పైడికోస్తాలండీ పట్టిపూశేడూ
తూరుపుకి పడమరకి ఏకసాలాశి
మామామ మలిరెడ్డి బయళెల్లినాడూ
పారన్నూ తట్టన్నూ పట్టుకున్నాడూ
పారతోపారడూ మన్నుతీశేడూ
తట్టతో తట్టాడూ మన్నోశినాడూ
చెరువు పోల్చినాడూ మామ మలిరెడ్డి
గట్టేరు పరచేడు మామ మలిరెడ్డి
ఇంటికొచ్చీనాడూ తాను మలిరెడ్డి
ఆప్రొద్దు పోనిచ్చి ఆమరవనాడూ
వూరూరి బళ్ళన్ని తోలించినాడూ
తోలినారాబళ్లు తోటవెంబడినీ
వెళ్ళేయి ఆబళ్లు నల్లకొండలికీ
నల్లకొండలరాళ్ళూ తీసుతున్నారూ
తీశినారాళ్ళంనీ బళ్ళకెక్కించీ
తోలినారాబళ్లు తోటవెంబడినీ
మామామ మలిరెడ్డి కొమ్మ వెల మోడూ
ప్రొద్దుప్రొద్దునలేచీ ప్రొద్దున్నలేచీ
అప్పుడేమీపనులూమామమలిరెడ్డి
వూరూరి వుప్పరల పిలిపించినాడూ
తానూరి వుప్పరల తమపేరబిలచీ
వచ్చెనేవుప్పరలూ అతివేగరమునా
ఏమోయి మలిరెడ్డి ఏమిమలిరెడ్డీ
మమ్ము పిలిపించేనా మావిలెత్తేమీ
ఓయోయి ఉప్పరలూ ఓయి ఉప్పరలూ
తట్టేది బుట్టేదీ త్రవ్వపారేదీ
ఘనమైన వుప్పరలూ గడ్డపారేదీ

ఓయోయిమలిరెడ్డి ఓయిమలిరెడ్డి
తట్టిదిగో బుట్టిదిగో త్రవ్వపారిదిగో
ఘనమైన ఉప్పరిని గడ్డపారిదిగో
వచ్చినారుప్పరలూ అతివేగరమునా
కోడలా కోడాల కోడలామల్లూ
వెండిగాదెలమీద ఇందుగులువారే
పైడిగాదెలమీద పచ్చలోరేనే
వెండిగాదెలధనము వెళ్ళబోయించే
పైడిగాదెలధనము పైనిబోయించే
గొడ్డువారీధనమూ గోలేలతోటీ
గోలేలతో ధనము గొబ్బ త్తినారూ
తబుకులతో ఆధనము త్రవ్వింపచిందీ
ఎవరిమాటలువారూ కట్టుకున్నారూ
ఎవరిఇళ్ళకువారూ వెళ్ళిపొయ్యేరూ
ఆప్రొద్దుబోనిచ్చి ఆమరవనాడూ
చెరువుచెయ్యడమునకూ వచ్చెఉప్పరలూ
చెరువుచేస్తున్నారూ తాను ఉప్పరలూ
అప్పుడేమీపనులూమామమలిరెడ్డి
ప్రొద్దుప్రొద్దునలేచీ ప్రొద్దున్నలేచీ
చెరువు చూడడమునకూ వెళ్ళె మలిరెడ్డి
ఓయోయి ఉప్పరలూ ఓయి ఉప్పరలూ
ఏనుగులు నడిచేటీ వెలువులుండాలి
మాబళ్లు నడిచేటీ బాటలొయ్యేండి
ఆమాట మలిరెడ్డి చెప్పి ఉప్పరలూ
వారియిళ్ళకువారూ వెళ్ళిపొయ్యేరూ
ఆప్రొద్దు బోనిచ్చి ఆమరవనాడూ
మళ్ళవెళ్ళినాడే మామమలిరెడ్డి
ఓయిఉప్పరులూ ఓయి ఉప్పరలూ
గుర్రాలునడచేటీ గుంపులొయ్యేండి

ముత్యాలు చెరువూలే మూడు మదుముల్లూ
వజ్రాలు చెరువూకే వాలుగొమ్ముల్లూ
పగడాలు చెరువూకీ పారుబట్టెల్రా
ఆమాట ఉప్పర్లకి చెప్పిమలిరెడ్డి
వారియిళ్లకువారూ వెళ్లిపొయ్యేరూ
ఆప్రొద్దు బోనిచ్చి ఆమరవనాడూ
వూరూరికంసాల్ని బిలిపించినాడూ
తానూరి కంసాల్ని బిలిపించినాడూ
విశ్వబ్రాహ్మడు కొడుకా ఇంద్రనీలుండా
వచ్చెనే కంసాలి అతివేగిరమునా
ఓయోయి మలిరెడ్డి ఓయిమలిరెడ్డి
చెరువులుకి మదుమూలూ కట్టించుతావా
చెరువుచేయించిందికోడలూమల్లూ
తోటవేయించిందీ కోడలూమల్లూ
నూతులూతీయించే కోడలూ మల్లూ
ఆప్రొద్దుబోనిచ్చి ఆమరవనాడూ
బళ్ళతోటీ రాయి తెచ్చెరామన్నా
చెరువొడ్డుకీరాయి తెచ్చెరామన్నా
ముత్యాలు చెరువూకీ మూడుమదుముల్రా
మూడుమదుములుకట్టే తానుకంసాలీ
వజ్రాలు చెరువూకీ వాలుగొమ్మూలూ
వాలుకొమ్ములుకట్టీ తానుకంసాలీ
పగడాలుచెరువూకీ పారుబట్టెల్లూ
పారుబట్టెలుగట్టీ తానుకంసాలీ
అప్పుడేమీపనులు మామ మలిరెడ్డి
కోడలా కోడలా కోడలామల్లూ
తబుకులతో వరహాలుత్రవ్వితేవమ్మా

విశ్వబ్రహ్మకొడుకా ఇంద్రనీలుండా
ఆయింద్రనీలుకూ ఇచ్చె మల్లమ్మా
వారియిళ్ళకువారూ వెళ్ళిపొయ్యేరూ
సంపూర్తిగాచెరువు పనిచేశెనోరి
ప్రొద్దుప్రొద్దునలెగిచీ ప్రొద్దున్నలేచీ
అప్పుడేమీపనులూ తాను మల్లమ్మా
వుత్తరం మెరశిందీ వురుముగర్జిల్లీ
దక్షిణం మెరశిందీ ధరణి గర్జిల్లీ
జర్మనీరాజ్యాన్ని జల్లుదీర్చిందీ
వడ్డాదికొండలికి ఒడ్డెనొరషంబూ
తిరుపతికొండలికి తిరిగె నొరషంబూ
మూడుగులకొండలికీ మళ్లెనొరషంబూ
మనవూరు కొండలికీ వచ్చెనొరషంబూ
వుండుండి మల్లమ్మ వాకిటకు వచ్చి
తూర్పుభాగమువైపు తొంగిజూచిందీ
చినచిన్న మేఘాలూ చిన్నన్నరారా
ఆపాటిమేఘాలూ అయినన్నరారా
పెదపెద్ద మేఘాలూ పెద్దన్నరారా
చేరంతిమేఘంబూ చెమరుకున్నాదీ
గంపంతమేఘంబూ గాదుకున్నాదీ
కురిశిందివర్షంబు కుంభజలనిధులూ
ఏనుగుతొండాన్ని ఏలగట్టినట్టూ
పారెనే ఆగంగ పాలసంద్రముకీ
ముత్యాలువడి చెరువూ మూడు మదుముల్రా
వజ్రాలుచెరువూకీ వాలుగొమ్ముల్రా
తిగెవడీలాగా తీర్చిందిగట్టూ
వుస్తిపేనినలాగా వూసిందిగట్టూ
అత్తికర్రలాగా అమరిందిగట్టూ

నట్టనడమునిచిన్న కలములేశిందీ
అప్పుడేమీపనులూ మామ మలి రెడ్డి
ప్రొద్దుప్రొద్దున లెగిచీ ప్రొద్దున్న లేచీ
పంచ చెప్పూజోడూ తొడిగె మలి రెడ్డి
ముత్యాలు మునకాలూ చేతబట్టే డూ
పగడాల చెప్పజోడూ తొడుగుకున్నాడూ
కాయపంచలచాపు కట్టుకున్నాడూ
ముత్యాలపచ్చడమూ కప్పుకున్నాడూ
పారున్న కత్తవఱుకు పట్టుకున్నాడూ
పొలముగొ కెళ్లేడు తాను మలిరెడ్డి
పొలమంత దిరిగేడూ తాను మలి రెడ్డి
గట్టులేనీచోటా గట్టేశినాడూ
మూలబోయినచోటా మూలేశినాడూ
పొలమంతదిరిగేడు తాను మలిరెడ్డి
గట్టెక్కినాడండీ తాను మలిరెడ్డి
గట్టునడుముకివచ్చే తాను మలిరెడ్డి
నట్టనడుమ చిట్టే కలముజూశేనూ
పారెనే ఆగంగ పాలసంద్రముకీ
పగడాల చెప్పజోడూ దిగనాడినాడూ
ముత్యాలుపచ్చడమూ ముసుగుదీశేడూ
ముత్యాలు మునకాలు అక్కడుంచేడూ
పారతో పారాడూ మన్నేశినాడూ
తట్టతో తట్టాడూ మన్నేశినాడూ
నేనేమిచేతునో దైవమంటాడూ
మరితట్ట డోశేడూ మామ మలి రెడ్డి
నేనేమిచేతూనో దేవుడంటాడూ
దబ్బుదబ్బునగుండే మోదుకుంటాడూ
నెక్కినెక్కినశిరసు నేలపై గొట్టి
కోడిపుంజు నిస్తానూ కట్టవేకలమూ
కోడిపుంజు నాకొద్దు నేకట్టలేనూ
గొర్రెపోతునిస్తానూ కట్టవేకలమూ
గొర్రెపోతు నాకొద్దు నేకట్టలేనూ
బండిపోతు నిస్తాను కట్టవేకలమూ
బండిపోతు నాకొద్దు నేకట్టలేనూ
ఏనుగుని ఇస్తానూ కట్టవేకలమూ
ఏనుగు నాకొద్దు నేకట్టలేనూ
గుర్రాన్నియిస్తానూ కట్టవేగంగా
గుర్రాలునాకొద్దు నేకట్టలేనూ
నేనైనపడతానూ కట్టవేకలమూ
నీవైన నాకొద్దు నేకట్టలేనూ
నాభార్యనిస్తాను కట్టవే కలమూ
నీభార్య నాకొద్దు నేకట్టలేనూ
పెదకొడుకునిస్తానూ కట్టవేకలమూ
నీపెదకొడుకునాకొద్దు నేకట్టలేనూ
నాచినకొడుకునిస్తానూ కట్టవే కలమూ
నీచిన్నకొడుకు నాకొద్దు నేకట్టలేనూ
నడిపికొడుకు నిస్తానూ కట్టవే కలమూ
నీనడిపికొడుకునాకొద్దు నేకట్టలేనూ
నాపెద్దకోడల్నిస్తానూ కట్టవే కలమూ
నీపెద్దకోడలునాకొద్దు నేకట్టలేనూ
ఏడుగురుతోటీదే వక్కకూతూరూ
కూతురు లచ్చమ్మని యిస్తాను కట్టవే కలమూ
నీకూతురూ లచ్చమ్మ నాకొద్దు పోరా
ఏమికోరూ తావూ కోరవేగంగా
ఏమిగోరూ తానూ ఏమి మలిరెడ్డి
మూనాలు పురటాలూ ముద్దు మల్లమ్మా
మల్లమ్మని స్తేనూ నే నె కడతానూ
పాపకారీగంగ నివుపాడుగానూ
పాపకారీ చెరువూ నీవుపాడుగానూ
అన్యకారీగంగ నీవారిపోనూ
కోరగాకోరాగా ఏమికోరితివి
మూనాలు పురటాలే ముద్దు మల్లమ్మా
అన్యకారీకలమూ నీవారిపోనూ
నోటిపాలూడుకిచీ మల్లునేదె స్తి
నాకొడుకు రాజన్న దండెళ్ళినాడే
వాడొచ్చి అడిగితే ఏమిజెప్పనూను
అనిబలికి మలిరెడ్డి ఇంటికొచ్చేడూ
ఇంట్లోనుమల్లమ్మ తానేమిపనులూ
ప్రొద్దుప్రొద్దున లెగిచీ ప్రొద్దున్న లేచీ
ప్రొద్దున్న మల్లమ్మ తానేమి పనులూ
నాల్గుమూలలకసవ నట్టింటతుడిచీ
పట్టి చాటడుకసవ పారబోశిందీ

—సశేషము.



పువ్వులను బలియిస్తే పుణ్యంవస్తుందా?

మానవసంఘంలో కొందరువ్యక్తుల ఆశయ సాఫల్యం కొరకు నరబలి నేడూ జరుగుతూనే వుంది.

కాని కాలగతినిబట్టి రూపాంతరం పొందిందని చెప్పవచ్చు.

పాప పరిహారార్థమో, ముక్తి కొరకో, భుక్తికొరకో దేవుని సంతృప్తిపరచడ మనే నెపంమీద అనాదిగా ప్రపంచంలో బలిదానాలు సాగుతున్నాయి. కొన్ని కొన్ని రకాల పరిమళములవల్ల ధూపాలవల్ల భగవంతుడు సంతృప్తుడగుతాడనేది కూడా ఒకమూఢ నమ్మకం.

ఆనమ్మకంతోనే మనవారు యజ్ఞయాగాదులలో ఆద్యం మొదలైనవి హోమంచేసేవారు. ఆ పొగలు ఊర్ధ్వలోకం చేరి దేవతలను సంతోషపెట్టి కోరిన వరాలు ఫలిస్తాయని విశ్వాసం.

అయితే దేవుడుకూడా మాటల్తో తృప్తిపడకపోవటంచేత మాటలు చెల్లించవలసివచ్చేది. ఇక్కడ మాటలంటే డబ్బుకాదు, సురాపానం, పాలు, పెరుగు, నెయ్యి,నూనె తుదకు మేకరక్తమో గుర్రపు రక్తమో పశురక్తమో నరపశు రక్తమో ఏదో ఒకటి కూడా ఆహుతి చేయవలసి వుండేది.

ఈరక్తం దేవతలకు ఆహారమనే వారు. మాంసంకూడా హోమం చేసేవారు.

హోమం చేయగా మిగిలిన మాంసం కమ్మగా వండి చక్కగా భుజించేవారు పూజారి. యజ్ఞద్రష్టలు కర్తలును ఏయే పశువు ఏయే యజ్ఞాలకు ఉపయోగించాలో చర్చించి పెద్దపెద్ద గ్రంథాలు వ్రాసారు.

ఆరోజుల్లో మానవులనుకూడా దేవుళ్ళకు దేవతలకు బలియిచ్చేవారు.

ఈనాడు యూరపులో విరివిగా జరుగుతోంది నరబలి!

పూర్వం అశ్వమేధయాగాలు చేసి మహారాజాధిరాజు లనిపించుకున్నట్లు యీనాడు నరుల్నే హోమం చేసి నియంత లనిపించుకుంటున్నారు.

అయితే యిదికొత్తకాదు.పాత పాఠమే తిరిగి చదువుతున్నారు.

యూదులలో 'మెలోక' అనే దేవునకు తమ పిల్లలను బలియిచ్చేవారు. కార్తజేజి అనే ప్రదేశంలోని యూదులు తమ ప్రథమ సంతానాన్ని దేవుని ప్రీత్యర్థం జీవాలతోనే దహనంకావిస్తూండేవారు.

ఫొనీషియన్ దేశీయుల్లో తమ ప్రథమ పుత్రుని బలి యిస్తే భగవంతుడుప్రీతుడై గొప్ప మేలు కూరుస్తాడని పిచ్చినమ్మకం వుండేది.

తరువాత సంతానంలోని కన్యలను దేవతలకు దానం చేసేవారు. వీరే ఒక పద్ధతి దేవదాసీలు.

ఆదేవదాసీలలో కొంతమందిని బలికూడా యిచ్చేవారు. అవసరమని తోచినప్పుడు. 'అవసర నైవేద్యం'గా ఉపయోగించేవారు.

రాజమండ్రీలో సంతాన గోపాలస్వామి ఆలయం వున్నట్టే ఉత్తర హిందూస్థానంలో. ప్రేమపురిలో మార్తాండాలయం ఒకటి వుంది. ఆదేవునికి మ్రొక్కుకుంటే సంతానం కలుగుతుందని నమ్మకం. కాగా తమ ప్రథమ సంతానాన్ని దేవునికి సేవకు వప్పగిస్తామని మ్రొక్కుకుంటారు.

ఇది నేటికికూడా సాగుతోంది.

ఈరోజుల్లో పూర్వమంతటి మూఢభక్తి లేదు. ఇప్పుడు బలిదానాలు అన్నీ నామమాత్రంగానే జరుగుతున్నాయి.

కేశఖండనతో బలి యిచ్చినట్టే అవుతుందనే వుద్దేశంతో బుర్రలు మాత్రం గొరిగించుకుంటున్నారు యిప్పుడు.

తిరుపతిదేవుని మొక్కులే ఇందుకు తార్కాణం.

అందుకనే అర్జునుడు ఆనాడు ఉత్తర గోగ్రహణ సందర్భంలో పీకలు కోయడానికి బదులు పిలకలు కోశాడని అంటారు.

నైలునది వరదలు వస్తే పండ్రెండేండ్ల బాలాకుమార్తెను పచ్చగా పసుపు రాసి ఎర్రటి బొట్టు పెట్టి గంగమ్మతల్లికి వప్పగించే ఆచారం వుండేది. రానురాను ఒక లక్కబొమ్మను చేసి నదిలో విసిరే వారు. మనదేశంలోకూడా యిట్టి గాధలు చాలావున్నాయి.

గ్రీక్ దేశంలోకూడా మానవ బలి బహుళంగానే వుండేది. మన దేశంలో 'శిరి' వుత్సవాల్లో పూర్వం మనిషిని కట్టి చచ్చేవరకు శిరి తిప్పేవారు. దాని చిహ్నము నేడు కూడా కొన్ని అమ్మవారు తీర్థాలలో కనపడుతుంది.

కాలం మారినకొద్దీ ఆచారాలు మారడం సహజం.

బలిదానాలు తగ్గి నైవేద్యాలు అమల్లోకి వచ్చాయి.

దేవుళ్ళకు దేవతలకు నైవేద్యాలు పెట్టడం మనకందరకు విశదమే ఈ ఆచారం జర్మనీ, రష్యా, లాప్లాండుల్లోకూడా బహుళంగా వుంది.

ధూపాలు, దీపాలు మనదేశంలో యింకా విరివిగానే కనబడుతున్నాయి. లక్షవత్తుల దీపారాధన సుప్రసిద్ధమైనవ్రతం. విజ్ఞానాభివృద్ధివల్ల జంతుకోటిని బలియిచ్చే విధానం సన్నగిలింది.

మనుష్యులను బలియిచ్చేది మారుమూల ఏ కలకత్తా నగరం లాంటి చోటనో జరుగుతోందికాని ఆక్రౌర్యం హిందూదేశంలో విరివిగాలేదు. యిప్పుడు హిట్లరు హయాంలో అది యూరపులో ప్రబలుతోంది.

జంతుబలి కూడా పల్లెలలో ఎక్కడో ఒకటిరెండు చోట్ల కనపిస్తుంది. అంతే.

దేవుని పేరట బలితగ్గితే నరదేవులకొరకు లెక్కలేనన్ని జంతువులు నిత్యమూ కసాయివాని కత్తికి ఎర అవుతూనే వున్నాయి. అది సృష్టితోగాని అంతంకాదు—

తెలుగుమీరిపోయి ప్రజలు దేవునిపేరట చంపకండా అతని ముఖాన యిన్నిపళ్లూ పువ్వులూ పడవేయడం ప్రారంభించారు. కాని పువ్వులకుకూడా ప్రాణమున్న సంగతి మనవారికి తెలియదనగలమా?

పశుపక్ష్యాదులను బలి యివ్వకూడదే అన్నారుకాని కదలా మెదలలేని అమాయకపు పుష్పసంతతిని కనికరించిన పుణ్యాత్ముడెవడూ కనుపించలేదు.

అందమైన యీజీవకోటిని నిత్యము దేవాలయాల్లోను చెర్చిల్లోను సభల్లోను, గర్భాదానపు గదుల్లోను ఎన్నింటిని బలియిస్తున్నారో లెక్కవుందా ?

జీవహింస పనికిరాదని బ్రహ్మాండాలు బద్దలగొట్టే ఉపన్యాసకులు కూడా పూలదండ వేయకపోతే ముఖం ముడుచుకుంటారే. ఆమాత్రం లోకజ్ఞానంలేదేం! పూలదండను వేసుకోవడంవల్ల అమాయకపు జీవాలు ఎన్ని హింసింపబడుతున్నాయో ఏమైనా గుర్తించారూ? పువ్వును పువ్వుబోడిని వద్దనే పెద్దమ్మ నాకు ఇంతవరకూ కనుపించలేదు.

రెండింటినీ నలిపిపోయ్యని నరాధముడు లేడు.

ఇంగ్లీషువారు 'యీస్టరు'వచ్చిందంటే చాలు చచ్చినవాళ్ళ ఆత్మశాంతికోసమని బ్రతికివున్న పుష్పరాజాలను పుణికి ఆ శ్మశానాల్లో పెడతారు. అంటే కోడిపిల్ల గొంతుకు నులిమినట్లు యీ పుష్ప సంతానాన్ని బలియిచ్చి దీన్నికూడా శ్మశానంలో చేరుస్తారన్నమాట. ఇదేనా అర్థం?

జీవహింస పనికిరాదని ప్రబోధించే సంఘాలు అనేకం వున్నాయి కాని పువ్వుల సంగతీ కాయల సంగతీ ఎవరూ లెడవినవారు లేరు.

మహానుభావుడు జగదీశబోసు కృషిఫలితంగా పువ్వులకుకూడా ప్రాణాలున్నాయన్న సంగతి ప్రపంచానికి తెలిసింది. ఏంలాభం?

మనకు తెలియకపోయినంత మాత్రాన పువ్వుల్లో ప్రాణంలేదనుకోవడం అవివేకంవల్లనే. లండ

నులోని శ్మశానాలు పువ్వుల స్మశానాలంటే నమ్మండి. వాటి ఉసురే నేటి భీభత్సానికి కారణం. అమాయకులను ఏడిపించినవాడు ఎన్నడూ బాగుపడడు.

మదరాసులో చూడండి ఎవరేనా స్వర్గస్థులైతే రాచపీనుగు తోడులేకండా చావదన్నట్టు లక్షలాదిగా జీవకోటులను వెంటబెట్టుకుపోతాడు. ఎన్ని పువ్వులు ఆ అస్పృశ్యునితో 'సతి' సలుపుతాయో చెప్పలేను.

లక్ష్మీదేవికి ఆలవాలమైన తామరపువ్వులు కాష్మీరదేశంలో విరివిగా వున్నాయి. అవి నిత్యం ఎన్ని దైవకార్య నిమిత్తం బలి అవుతాయో అంచనా వేయలేం. కాబట్టి అహింసా తత్వవాదులు జీవహింస నిరశించే సంఘాలు పువ్వులకుకూడా ప్రాణంవుందని తెలుసుకొని వాటిని నలిపి పారేయకండి బాబు.

హిట్లరు మనుష్యులనే మారణ హోమంచేస్తూ వుంటే ఒకరోజు ఉండి రాలిపోయే పువ్వులను కోయవద్దంటూ వేంటి అంటారేమో.

మనకు మనశత్రులకు వున్న తేడాయే అది. మనమంత సరళస్వభావులమని చీమకేనా చెరుపు చేయలేనంతటి, పూవునేనా పుణకలేనంతటి కరుణార్ద్ర హృదయులమని తెలియజేద్దాం. అప్పుడేనా ఆ రాక్షసుడు మన దగ్గరకురాకండాపోతాడు.

మహావాక్యరత్నాలు

నీచుడు తరచు పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతాడు. కాని ఎప్పుడు చిరునవ్వు నవ్వడు. జ్ఞాని మందహాసమే గాని ఓటికుండ మ్రోగినట్టు నవ్వడు.

—Chester field

... ...

ప్రపంచాన్ని అర్ధంచేసుకోవడం. ఒక ఎత్తు అర్ధంచేసుకొన్నదాన్ని ఆమోదించడం రెండింటికి చాలా తేడావుంది.

—Halifax

... ...

మగవారు స్త్రీలకు యివ్వడానికి బదులు వారివద్ద పుచ్చుకుంటూవుంటే కొంతదాసులవడం తధ్యం.

—Bagehot

... ...

మేధావంతులు, అసమాన శక్తివంతులు సాధారణంగా పశుప్రాయులుగా ప్రవర్తిస్తారు.

—Sir Henry Taylor

... ...

గెడ్డాలున్న ముసలివారికి, తోకచుక్కలకు గౌరవం ఎక్కువ. ఏమంటే అవి రెండూ భావినిగూర్చి చెప్పగలవనే భావం ప్రతీమనిషికి వుంటుంది గనుక.

—Swift

... ...

జ్ఞానవంతులు ఆదాయాన్నిమించకండా కర్చుచేసేటట్లైతే చలోక్తులుకూడా సమయస్ఫూర్తిగానే కాని అధికంగా ఉపయోగించరు.

—Chesterfield

... ...

ఆపదలందు ధైర్యగుణము సంపదలందు తాల్మియు చూపడం శూరుని లక్షణం.

—భర్తృహరి.



వాహినీవారి దేవతలో ఒక సన్నివేశము

ముద్దులవల్ల మూడులాభాలు కాని

ముద్దులకు మురిసిపోని వారుండరు. ముద్దులవల్ల మూడు లాభాలున్నాయని పెద్దల సుద్దులు.

ఆరోగ్యవంతులు ఒకరి నొకరు ముద్దుపెట్టుకోడంవల్ల శబ్బర ఏమీ లేదు. సరికదా ఉత్సాహాన్ని పెంపొందజేస్తుంది. ప్రేమజీవులు తమ ప్రేమను వ్యక్తంచేయడంలోను, అనురాగాన్ని కనుపరచడంలోను, గౌరవాన్ని చూపడంలోను ముద్దు ఉన్నత స్థానాన్ని పొంది వుంది.

దొండపండులాంటి అధరం గల అంగనలు ఎదురైతే లొట్టలు వేయనివా డుండడు. అందులోను ముద్దుపెట్టుకోడం మంచిదంటే కనపడ్డ పల్లవాధరలను పట్టి చప్పరించేస్తారు రసపిచ్చగాండ్రు. అందులోను ఆంధ్రాహాలీవుడ్‌లో తిరిగే వారు మేకప్ చేసుకొన్న నక్షత్రాలను చూచి మురిసిపోయి ముద్దులు పెట్టుకుంటారేమో జాగ్రత్త పరమానందయ్యగారి శిష్యుల్లాగ ఆముద్దులో రుచి లేదనవొద్దు. మేకప్ ముద్దులో పస వుండదు. ముద్దుయొక్క రహస్యం కనుక్కోవాలని అనేకమంది తలక్రిందులా తపస్సు చేస్తూవున్నారు.

ఈమధ్య డాక్టర్ జోసై ఓల్డ్ ఫీల్డ్ అనే వేదాంతి వైజ్ఞానికుడు కూడాను — ఆరోగ్యవంతులైన స్త్రీ పురుషులు ఎన్ని ముద్దులు పెట్టుకున్నా హాని లేదని తేల్చాడు అనారోగ్యంగా వున్నవారిని అంటరాదన్నాడు. కురూపులుగా నున్న స్త్రీలు సంఘానికి తీరని అపకారం చేసినవా రవుతున్నా రని. అలాంటివారు లేకండావుంటేనే సంఘం బాగుంటుందని అతని అభిప్రాయం.

ఓల్డుఫీల్డు జ్ఞానం ఎరుగున్నాక ఎప్పుడు మాంసం తిని ఎరుగడు. అతడు అన్నాడు 'ముద్దుపెట్టుకోవడం మానవునకు మంచినే చేస్తుం' దని.

ముద్దు పెట్టుకోవడం సహజం. ఒక చంటిపిల్లని చూడ్డానికి వచ్చిన అమ్మలక్కలందరు ఆ పిల్లని ఎల్లా ముద్దుపెట్టుకుని ముక్కూ చెవులు పెదవులు కొరికేస్తారో చూడ లే?

అసలు యీ ముద్దులు పెట్టుకోవడం 15-వ శతాబ్దంలో బయలుదేరిందిట.

ఇతర దేశాల్లో అధికారుల. చేతులు కాళ్లు కూడా ముద్దుపెట్టుకోవడం అలవాటట—గౌరవాన్ని తెలియజేయడానికి.

పెద్ద హోదాలో వున్నవారు కూడా తమ అధికారులు వస్తే పాదాలు ముద్దుపెట్టుకోవడం ఆచారమైంది.

పాదాలు ముద్దుపెట్టుకోవడం ఫ్రాన్సుదేశంలో పరిపాటి.

ఒకసారి వికింగ్ అనే సేనాని రాజుగారి పాదాలు ముద్దుపెట్టుకోడానికి కొంచం కష్టపడ్డాడట.

తప్పనిసరి అగుటవల్ల వొంగడం యిష్టంలేక అతని పాదం పట్టి అట్టేట్టే పైకి ఎత్తేసాడట తన నోటి దగ్గరకు తెచ్చుకోడానికి నిట్టనిలాగా నిలబడి. ఆరాజుతూలి పడిపోయాడట.

పంద్రెండవ యూఘు నార్‌మండీ రాజు ఆదేశంలోని ప్రతి స్త్రీని ముద్దుపెట్టుకొన్నట్టు చెపుతారు చరిత్రకారులు.

ఫ్రెంచిదేశంలో ముగ్గురు నౌకర్లను పోషించగల ధనికుడు గొప్ప స్త్రీలను తప్ప తక్కిన వారినందరను ముద్దుపెట్టుకోవడం పరిపాటిట.

ముద్దుపెట్టుకోవచ్చుకాని అది అనారోగ్యమని, అసభ్యమని ఉత్తర అమెరికాలో ప్రభుత్వం నిషేధించింది.

ఒకసారి ముద్దుపెట్టుకుంటే 100000 కంటికి కనుపించని క్రిములు ఒకరి అధరామృతంలోనుండి యింకొకరికి వెడతాయట.

అందులో నూటికి 40 క్రిములు హానికరమైనవట.

దీనివల్ల డిఫ్తీరియా అనే జబ్బు సులభంగా ఒకరినుండి ఒకరికి పాకుతుంది.

కాబట్టి ముక్కుపళ్ళ ముసలమ్మలని, తప్పడముక్కు తంగమ్మలను ముద్దుపెట్టుకోక, కొంచం జాగ్రత్తగా మసులుకోవాలి. అందమైనవాళ్ళని అంటబోయి దవడ శుద్ధులు చేసుకోకండేం!—

డానికి శంకరుడు తన్ను ఆదేశించాడనీ -తన చేతుల్లో చావడానికే ఆ రాక్షసుడు అక్కడికి వచ్చాడనీ బదులు చెప్పింది.

చెబుతూనే ఆమె కత్తితో అతనిమీదికి వెళ్లి అతని చేతులూ, తల ఖండించి ఆకాశం వరకు విజృంభించింది.

దుర్గాదేవి శాలికత్తెలైన యోగినులు ఆమెను ఆశీర్వదించారు; అర్తుల్ని రక్షించిందని స్తోత్రం చేశారు.

అప్పుడు తొర్రలోనుంచి ఆర్గురూ బయటికి వచ్చి ఆమె పాదాలమీదపడి తమ్ము రక్షించినందుకు మ్రొక్కారు.

అందుమీద ఆమె వారితో తన పేరు ఏకాదశి అనీ, తనకు తల్లిదండ్రులు లేరనీ, ఆ ఆర్గురి నిశ్వాసంవల్లనే తాను జనించాననీ, ఆనాడు చేసినట్లే పదిహేను రోజులకు ఒకసారి ఏకాదశి వ్రతం చేయమనీ, చేస్తే సకల పాప పరిహారం అవుతుందనీ చెప్పింది.

ఆషాఢ శుక్లఏకాదశికి మహాఏకాదశి అని పేరు ఈ రోజు మొదలు విష్ణుమూర్తి నాలుగు నెలలు పాతాళ లోకంలో బలిచక్రవర్తి ద్వారంవద్ద వుంటాడు. కార్తిక శుక్లఏకాదశికి వెనక్కి తిరిగివస్తాడు అందుచేతనే ఈ పండుగని దేవశయని అని కూడా అంటారు.

ఈ పండుగను గురించి బ్రహ్మవైవర్త పురాణంలో వివరింపబడివుంది.

పండరీపురంలో ఈ పర్వం బాగా జరుగుతుంది.

౨
దీపపూజ

ఆషాడ కృష్ణపక్ష అమావాస్య

ఇంటిలోవున్న ఇత్తడి దీపస్తంభాలు, కుందెలు అన్నీ శుభ్రంగా కడుగుతారు. కొయ్యపలకల్ని పేడతో అలికి దాని మీద ముగ్గులు పెడతారు. కుందెలు, దీపస్తంభాలు ఆ పలకలమీద వుంచుతారు. స్త్రీలు ముస్తాభై దీపాలు వెలిగించి పసుపు కుంకుమలతో పూజచేస్తారు. లడ్వాలు, మోరుండలు నైవేద్యం పెడతారు. బ్రాహ్మడికి, ముత్తైదువుకి పెట్టుకుంటారు. సాయంకాలం దీపం వెలిగించి ఇంటి నలుమూలలా చూపిస్తారు.

౩
చాతుర్మాస్యము

చాతుర్మాస్య వ్రతాచరణ ప్రకారం బ్రహ్మవైవర్తపురాణంలో కలదు. ఆషాడ మాస శుక్లపక్ష ఏకాదశినాడు ఉపవాసంవుండి చాతుర్మాస్య వ్రతకల్పం ప్రారంభించాలని కృష్ణభగవానుడు యుధిష్టురునకు చెప్పినట్లు కలదు.

శయనింపపెట్టిన విష్ణుమూర్తికి పూజ. చాతుర్మాస్యవ్రతం మొదలుకొని ఏకాదశి, ద్వాదశి, అమావాస్య, అష్టమి, కర్కాటక సంక్రాంతి మున్నగు పర్వాల నాడు ఉపవాసాలు వుంటూ కార్తిక శుక్ల ద్వాదశికి ఆవ్రతం పూర్తిచేయాలి.

చాతుర్మాస్యవ్రతంలో పిప్పలవృక్షానికి ప్రదక్షిణం ప్రధానం. దేవాలయాల్లో దీపారాధన.

చాతుర్మాస్య వ్రతంలో సరస్వతీ పూజకూడా కలదు.

సంవత్సరంలో వచ్చే ఇరవై నాలుగు ఏకాదశులు ఉపవాసంవుండలేక పోయినా చాతుర్మాస్యాల్లోవచ్చే ఎనిమిది ఏకాదశులైనా వుండడం ముఖ్యం. ఈఎనిమిదిఏకాదశులలో వంకాయ, కరుబూజ, సేగి (బేల్), తినకూడదు, వీటిని తిన్నవాళ్ళయింట్లో భగవంతుడు వుండడట.

తేనెటీగలసహాయమున పంటల అభివృద్ధి

సోవియట్‌రష్యాలో తేనెటీగల నూతనో ఉపయోగం కనిపెట్టారు.

తేనెటీగలకు కడుపునిండా తిండి పెట్టి పూతమీదనున్న చేలమీదకు తోలుతారు. అవి అహారంకొరకు వెతుకుటలో పుప్పొడిని ఒక పువ్వునుండి యింకో పువ్వుకి తీసుకుపోతాయి.

తేనెటీగలు ఒకేరకం పువ్వును దర్శించి దానిలోని తేనెను సేఖరించడం యింతవరకు ప్రకృతిధర్మం. కాని నేడు అన్ని పువ్వులచే కాయలు కాపించాల నేఆశతో వాటి ఏకపత్నీవ్రతాన్ని చెరచి యింత మేత వేసి అన్నిరకాల పువ్వులను ఒకచూపుచూచిరమ్మని పంటచేలకు తోలతారు.

తిండితిని సోమరితనం బలిసిన మానవుడిలాగే అవి రోదుకుంటో ప్రతీ పువ్వుమీదా వాలి శ్రమతీర్చుకుంటాయి. వాటి సంపర్కంవల్ల పువ్వులు కాయలవతాయి.

ఈరహస్యాన్ని కనిపెట్టింది సోవియట్టు వైజ్ఞానికులు. తేనెటీగల అహారాన్నిగురించి కూడా పరిసోధనలుచేసారు. పువ్వులనుండి సిరప్ తయారుచేసి దానితో తేనెటీగలను మేపినట్టుతెలుస్తోంది.

ఆ మేతతిన్న తేనెటీగలు కల్లుతాగినవారివలె కనబడ్డపువ్వునల్లా చూచివస్తుంది.

మొత్తంమీద తేనెటీగలను మేపి ఆబోతుల్లా పంటచేలమీదకు వదులుటవ పంట ఎక్కువైయుంరని ప్రకటించారు. ఆవైజ్ఞానికులు —

ఈర్ష్య ప్రణయవాహినిలో పుట్టే నాచు

"ఉ॥ కంటికి నిద్రవచ్చునె? సుఖం బగునే రతికేళి? జిహ్వకున్
వంటక మింపు నే? ఇతర వైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబుగలయట్టి మనుష్యున కెన్నఁడేనియున్
కంటకుఁడైన శాత్రవుఁ డొకండు దవంతటివాఁడు గల్గినన్."

రచయిత:

ఇందిరాదేవి

నీటికీ నాచుకీ నిప్పుకీ నుసికీ, పూవికీ తావికీ వెలుగు చీకట్లకీ ఎట్టి అవినాభావసంబంధం వున్నదో మానవజీవితంలో ప్రేమకు ఈర్ష్యకు అట్టి అవినాభావ సంబంధ మున్నది.

ఈర్ష్యకూడా ఒక విధమైన ప్రేమ అంటారు కొందరు.

వెలుగువల్లనే క్రీనీడ పుట్టినట్టు నిప్పువల్లనే నుసిపుట్టినట్టు ప్రణయం వల్ల ఫలించినదైనా ప్రణయవాహినిలో ఈ యీర్ష్య కలిస్తే ఆ వాహిని అంతా చెడుతుంది. నిప్పుని నుసి ఆర్పివేసినట్టు, నాచు నీటి యొక్క స్వచ్ఛతను నిర్మూలించినట్టు ప్రేమను భగ్నంచేస్తుంది ఓర్వలేమితనం.

ఈర్ష్య ఆత్మ దురభిమానాన్నే నిరూపిస్తుంది కాని ప్రేమను ప్రకటించదు.

ఓర్వలేమితనాన్ని మొదటిలోనే తుంపకపోతే మహామారిలా మానవుణ్ణి అతఃపాతాళానికి అణగద్రొక్కుతుంది.

తాను ప్రేమించి కామించిన వ్యక్తి తనలో లీనమై తనతోటే చనిపోవాలని వుంటుంది ఈర్ష్యాళువుకు.

దీనికి ముఖ్యకారణం స్త్రీలో కాని పురుషునిలో కాని సంపూర్ణత్వం లేకపోవడమే.

ప్రకృతి జీవితంలో ఏదీ పరిపూర్ణమయింది లేదు. అట్లాటిది వుందనుకోవడం మిథ్య.

అసంపూర్తిని సహించడమే జీవితాశయం. సమానభావంవల్లనే జీవితం మాధుర్యంగా వుంటుంది.

ఈర్ష్య ముఖ్యంగా స్త్రీపురుష సంబంధాలలో తీవ్రంగావుంటుంది. భార్యముందు భర్త కాని భర్త ముందు భార్య కాని వీరత్వాని శూరత్వాని చూపి ఆధిక్యత పొందాలని చూచుటే ఒకరినొకరు అర్థం చేసుకోడానికి బదులు ఒకరినొకరు బలాత్కారంగా లోబరుచుకోవాలని చూచినట్టవుతుంది.

బలాత్కారంవల్ల అనురాగం, దయ నాశనమవుతాయి.

అనుమానంవల్ల ఎంత అనురాగం చూపినా యింకా ఏదోలోపం వుందని పీకుతుంది.

చిన్న అలసత్వం పెనుభూతంలా కనుపిస్తుంది.

ఈర్ష్యవల్ల అభిప్రాయభేదాలు వస్తే ఎవరో ఒకరు అంతమైపోవాలని పిస్తుంది. సరసాలు విరసాలవుతాయి. నిద్రాహారాలు వుండవు. తృప్తిశూన్యం. సర్వప్రపంచమే శూన్యమై వెక్కిరిస్తున్నట్టు వుంటుంది.

నిత్యము సేవ చేసే వార్లలో ఏ కొంచెంలోపం వచ్చినా అనుమానం పెచ్చు పెరిగిపోతుంది. కాని అనుకోని చోట అనురాగం ఏ పాటి చూపినా బ్రహ్మానందం పడిపోతాం.

స్నేహితుడు ఒక సిగరెట్టు పీకయిస్తే చాలు 'అబ్బ ఎంత మంచి వాడండి, స్నేహపాత్రుడండి' అని మురిసిపోతాం.

కాని నిత్యం సంబంధం వున్న అప్పులు ఎంత చేసినా తృప్తి వుండదు.

అపరిమితమైన ప్రేమ అనుమానానికి దారి తీస్తుంది. ప్రేమించిన వ్యక్తి తనను విడిచి ఒక్క క్షణం మరుగుపడితే హృదయం లో భగ్గున మండిపోతుంది. ఈర్ష వల్ల కలిగే మెరుపుదెబ్బ తట్టుకోడం 'ఆ యబ్బ' తరం కాదు.

ప్రణయవాహినిలో ఎంతవిహంగంలా తిరిగే వ్యక్తి అయినా తన ప్రేమపాత్రులు అలా తిరిగితే సహించలేడు.

శీల మనేది మనిషికి సహజమైందికాదు. అది సంఘనియమాలవల్ల ప్రణయవాహినికి అడ్డుగా కట్టబడిన ఆనకట్టు. అది ఒక అలవాటు. దాని పరిణామమే వివాహం.

కాని ఆనియమాల్లో పడి నిలవలేక ప్రజలు గట్లు తెగ్గొట్ట చూస్తూనే వున్నారు. ఇష్టం లేకపోతే విడిచిపెట్టడానికి సంఘం ఆమోదించింది. పూర్వం లేచిపోయిన వాళ్ళను వెలేసారు. యిప్పుడు గౌరవిస్తున్నారు. ఫారే నేడు ఆదర్శ వ్యక్తులయే అదృష్టం పట్టింది.

కాని జనబాహుళ్యం అంత సాహసించలేదు. రోజురోజు భర్తలను మార్చుకునేదానికీ పశుప్రవృత్తికీ తేడ ఏమిటి?

పశుప్రవృత్తిలో వుండే కళావంతులే తమ జీవితాలను అసహ్యించుకొంటూ కుటుంబీకులవడానికి చూస్తూవుంటే ఒక భర్తతో కాపరం చేయడమే గొప్పదని అంటూవుంటే నిత్యం భర్తలను మార్చుకోడానికి ఎవరూ సాహసింపలేకపోయారు. అంటే అసలు లేరని కాదు.

విడాకులు ఉండడంవల్ల వివాహానుబంధనం మరింత బలపడిందని చెప్పాలేమో.

ఉన్నదానితో తృప్తిపడకపోవడం లేనిదానికి ప్రాకులాడటం మానవునకు సహజం.

స్వేచ్ఛగా వుండేవారు సంసారపక్షంలో వుండాలనుకోవడం సంసారులు సన్యాసులుగా వుంటే మంచిదనుకోవడం మానవ ప్రకృతిగాని మరేంకాదు.

వీటి కన్నిటికి కారణం ఈర్ష్య అని చెప్పక తప్పదు.

బ్రతుకుదెరువు తెలుసుకొని సహనభావంతో వుండడమే జీవిత పరమావధి.

గృహాల్లో కానీయండి మరెక్కడైనా కానీయండి చిన్నచిన్న ఛిద్రాలు రావడం ప్రకృతిలక్షణం. వాటిని సహనభావంవల్ల అతిక్రమించుటే పురుషలక్షణం. తుపాను చెలరేగినా శాంతంగా వుండడం మహాత్ముల లక్షణం. ఈర్ష్యను జయించినవాడే పరమేశ్వరుడు. ఎన్ని చెప్పినా ఈర్ష్య చాలాగడ్డుది. బహుపరాక్.

ప్రేమ—పెద్దలసుద్దులు

ప్రేమ గుడ్డిది అని అంటారు కాని పెద్దలేమంటారో చదవండి.

'ఆజన్మాంతం ఒక్కరినే ప్రేమించి కామించడం ఒకే జ్యోతిని ఎప్పుడూ మండేటట్టు వుంచడ' వంటిది.

—లియో టాల్‌స్టాయి.

నిజమైన ప్రేమ ప్రథమ సందర్శనంలోనే కలుగుతుంది. చూడగా చూడగా విరక్తి కలుగుతుంది.

—యిజరెయిల్ జాంగవిల్.

ప్రథమదర్శనంలో పుట్టిన ప్రేమలో వెకిలితనంవుంటుంది కాని ఒకరి నొకరు తెలుసుకోవాలనే కోరిక బలీయంగా వుంటుంది.

—బెర్నార్డుషా.

ప్రేమ ప్రతిష్టలాగే ఒకసారి పోతే తిరిగిరాదు.

—ఆ ఫ్రా ఫిన్.

రహస్యంగా ప్రేమించడం చాలాచెడ్డది. నాశనానికి కారణం.

—ప్లాటస్.

ప్రతీవాడు దెయ్యాలువున్నాయనే వాడే కానివాటిని చూసినవాడు లేనట్టు, ప్రేమనుగూర్చి ప్రసంగించేవాడేకాని నిజమైన ప్రేమను చవిగొన్నవాడు ఎవడూ లేడు.

—లారల్ ష కాల్డ్.

ప్రేమ తిండితినకపోయినా చావదు. కాని ప్రేమిస్తూన్నవాళ్లు అవమానిస్తే హతమారిపోతుంది.

మణిమాల

బొప్పాయి

బొప్పాయిచెట్లు మనదేశంలో ఎక్కడపడితే అక్కడ పెరుగుతై. వాటికి ఎటువంటి సాగుబడీ అవసరం లేదు. బాగా తయారైన బొప్పాయికాయ ఆరుపౌనులతూకం ఉంటుంది.

మనలో చాలమందికి బొప్పాయికాయలవల్ల ఉపయోగం తెలియదు. కొందరు బొప్పాయికాయ కూరకూడా చేసుకుంటారు. బాలింతరాళ్లు పాలుపడటానికి బొప్పాయికాయకూర తింటారనుకుంటాను.

కాని బొప్పాయివల్ల జనసామాన్యం ఎరుగని ప్రయోజనం చాలా ఉంది.

'బొప్పాయిని మించిన ఆహారం ప్రపంచంలోలేదు. దానిలో ఆహారపదార్థం జాస్తిగా ఉండటమేకాక, అది అనేకవ్యాధులకు విరుగుడు కూడాను. అందరూ నిత్యమూ బొప్పాయితింటే దీర్ఘాయువుల (నూరేళ్లు నిండినవారి) సంఖ్య జాస్తిఅవుతుంది,' అన్నాడొక వైద్యుడు.

అజీర్తికి విరుగుడుగా డాక్టర్లు పెప్సిన్ వాడుతారు. కాని బొప్పాయిపాలు పెప్సిన్‌కంటె ఎన్నోరెట్లు పనిచేస్తుంది. ఈపాలు జీర్ణకోశసంబంధమైన సమస్తవ్యాధులనూ, కడుపులోపుండ్లతోసహా, నిర్మూలంచేసి, జీర్ణకోశాన్నీ పేగులనూ సక్రమంగా పనిచెయ్యనిస్తుంది.

వండటానికి ఒకగంట ముందుగా మాంసంపైన ఈపాలు పూసిగాని, లేక ఒకరాత్రల్లా మాంసం బొప్పాయి ఆకుల్లో చుట్టిపెట్టిగాని దానిని మెత్తపరిచి వండుకోవచ్చును.

బొప్పాయి ముక్కలకు నిమ్మకాయ రసంపూసి తింటే రుచిగాఉంటాయి.

మనవారు బొప్పాయివల్ల పొందదగినంత ప్రయోజనం పొందటంలేదు. ప్రతిదొడ్లోనూ బొప్పాయిచెట్లు పెంచవచ్చును. వాటికి నీరుకూడా పొయ్యనక్కర్లేదు.

* * *

సమర్తాడితే చిమ్మిలెందులకు

హిందూదేశములో సాధారణముగ బాలికలు ప్రథమ రజస్వలకాగానే మూడు దినములు పండుగచేయుట ఆచారమై యున్నది........రజస్వల ఐన బిడ్డకు జాస్తిగా చిమ్మిరిని తినిపించెదరు. కొన్ని దేశములలో నువ్వులనూనెను త్రాగించెదరు ఈ ప్రకారము రజస్వల ఐన బిడ్డలకు దేశాచారమును బట్టి నువ్వుల సంబంధమైన పదార్థములను యిప్పించు ఆచారము యిప్పటికిని యున్నది.

హిందూ దేశాచారము, వైద్యము, చాలభాగము నొకటిగ పెనవేసుకొని యున్నవి. బిడ్డలు ప్రథమ రజస్వల ఐనప్పుడు వారల గర్భాశయము చక్కగ వికసించి ఋతురక్తము నిరాటంకముగ వెలుపల రావడము ముఖ్యమైన విషయము. అట్లు జరుగుటకుగాను ప్రథమ రజస్వలయందు మొదటి మూడు దినములు ఉష్ణవీర్యమైన పదార్థములను యిప్పించుట ముఖ్యము. అట్టి పదార్థములలో శ్రేష్ఠము లైనవి నువ్వులు బెల్లము. ఈ నువ్వులు బెల్లము సేవించుటవలన గర్భాశయము చక్కగ వికసించి ఋతురక్తము ధారాళముగ వెలుపల వచ్చును. ఆ మూడు దినములు భోజన పదార్థములందుకూడ ఉష్ణవీర్యముగల మధుర పదార్థములనే యిప్పించవలెను. నాగరికత హెచ్చుకొలది ఈ వాడుక క్రమక్రమముగ క్షీణించి పోవుచున్నది. ఈ కాలమున నువ్వులుబెల్లము యిచ్చుట ముతకవాడుకగ నెంచి. సుకుమారమైన బిడ్డలకు మొరటిపదార్థముల నిప్పించిన శరీరము వేడెక్కి చెడిపోవుదురని చెప్పుచు పూర్వాచారమును బొత్తిగ విడచి .... మధురాహారములకు బదులు విశేష పులుసు, కారము, ఉప్పుకలిగిన పదార్థముల నిచ్చెదరు. చల్లగాలి తగులనీయకుండా ఉండుటకు బదులు పంకాలక్రింద పరుండబెట్టెదరు. పురుషుని చూడకుండ నుంచుటకు బదులు సమస్తాభరణములచేత శృంగారించి సభలయందు కూర్చుండబెట్టి పాటకచ్చేరీలు నాట్యములు సలిపెదరు. పై విషయములను ప్రథమ రజస్వల కాలమందు కన్నతల్లి గమనించినచో ఘోరమైన ఋతుశూలవలన బాధపడరు.'

—దివ్యవాణి.

✻ అచ్చుతీరి అమ్మకమునకు సిద్ధముగా ఉన్న శ్రీ ఆండ్ర శేషగిరిరావుగారి గ్రంథములు

ఆంధ్రరమణీమణులు భా-౧

ఇందు—కాకతీయాంధ్రసామ్రాజ్య సింహాసన మధిరోహించి జనరంజకముగ, శత్రుభయంకరముగ రాజ్యమేలిన రుద్రమ్మ; ధరణికోట సింగపుపీఠ మెక్కి అసామాన్యముగ రాజ్యచక్రము త్రిప్పిన గణపమ్మ; ఆంధ్రదేశమున ఆడుదియై పుట్టిన మంత్రిరాక్షసుని అపరావతారముగా నాయకురాలను బిరుదుగాంచి పలనాటి నాగమ్మ. కౌగిలిలోనున్న భర్తను దీవించి కరవాలమొసగి కదనరంగమునకంపిన మాంచాల; ప్రజారంజకముగ పెద్దాపుర సంస్థానమును పాలించి తురక ఫౌజుదారుని బారి పడకుండ జోహారొనర్చిన అభిమానస్వరూప రాగమ్మ; ఆమె చేతులనుండి ఆమె మనుమని ఏడు మాసముల కసుగందుని గ్రహించి పంచకరపాట్లుపడి అరసి రక్షించిన స్వామిభక్తిపరాయణ మహాలక్ష్మమ్మ; పతియగు రాయజగపతితో సహగమన మొనర్చుచు పతి విరోధియగు ఆనందరాజునకు తిరుగని శాపమిచ్చిన మహాపతివ్రతాతిలకమగు సీతమ్మ; రాణివాసపు స్త్రీలందఱకంటె ముందుగాఁ దాను కత్తికెరయైన మానమెఱిగిన స్త్రీత్వమునకు మొదలి పేరైన బొబ్బిలిరాణి మల్లమ్మ; నిండు చూలాలయ్యు మానసంరక్షణార్థమై నిజప్రాణముల ఖడ్గమున కెరచేసిన రమణమ్మ— వీరలఅద్భుతచరితలు ఆంధ్రాభిమానముతో ప్రస్తరింపఁబడినవి.

2-వ కూర్పు. 112 పుటలు. దళసరి కాగితములు.

పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రరమణీమణులు భా-౨

ఇందు—రణరంగమున వీరవిహారము విరమించి యింటికి వచ్చిన పతికి వీరసందేశమిచ్చి తిరిగి కదనభూమికి పంపి అతనికి వీరస్వర్గమిప్పించిన ఆంధ్ర వీరపత్ని చానమ్మ- మానముకొఱకు, మాటవాసికొఱకు తన్నుతాను పొడుచుకొని చనిపోయిన తంజావూరి తెనుగురాణి రాజగోపాలమ్మ- యీ రాజగోపాలమ్మ మనుమని చెంగమలదాసుని విక్రాంతి సమయమున అరసి రక్షించి తన ప్రభుభక్తిని ప్రకటించిన దాది - మధుర ఆంధ్రనాయక రాజ్యపాలనమును మహనీయముగ సాగించి దాననిరతిని, ఆంధ్రభాషాభిమానమును అతిశయముగ ప్రదర్శించిన మంగమ్మ- చాందాసాహేబు మోసమునకు గుఱియైన మీనాక్షి- పథ్యముముట్టని పచ్చి బాలెంతరాలయ్యు తన సహగమనోద్యోగము నెఱవేరకపోగా పన్నీరు త్రాగి ప్రాణములు విడిచిన పతిప్రాణ ముత్తమ్మ ప్రజోపయోగమునకై శిశుసహితముగ బలిపోయిన సంగమ్మ వీరల పవిత్రచరిత్రలుగలవు.

దళసరి కాగితములు. 100 పుటలు.

పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

కేయూరబాహుచరిత్ర

శిల్పము మెరయ మంచనమహాకవి రచియించిన కేయూరబాహుచరిత్ర అను పద్యకావ్యమును ఆధారముగ తీసికొని తేటతెనుగు వచనమున జనసామాన్యముకొఱకు వ్రాయబడినది. పెండ్లాడినవానిని సార్వభౌమునిగా జేయు వరమునొందిన మృగాంకావళియను నొకరాజకన్యను కేయూరబాహు వను రాజునకు నతని ధర్మపత్నిచే భాగురాయణుడను నాతని మంత్రి నిజబుద్ధిబలమున వివాహముచేయించిన వృత్తాంతమిందలి ప్రధానకథ. నడుమ నడుమ చక్కని నీతికథలు పెక్కులు గలవు.

గ్లేజు కాగితములు. 90 పుటలు.

పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్ర రాజభక్తులు

రాజభక్తి యనుదిన దేశభక్తికి పర్యాయపదముగా రాణించుచుండిన ఆంధ్రదేశపు స్వతంత్రయుగ చరిత్రలలో రాణించు రాజభక్తశిఖామణులగు విశ్వనాథనాయడు, యాచమనాయుడు, అబ్దుర్ గజాక్ లారీ, కరిబసవస్వామి, తిక్కన మంత్రి, మహాలక్ష్మమ్మ, పాపారాయడు, హనుమప్ప నాయుడు అను ఎనమండుగురి చరిత్రలను కీర్తించు గ్రంథము.

గ్లేజు కాగితములు. 112 పుటలు.

పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

వనితాలోకానికి వలపుకాడు చంద్రుడు

పాలఁ బుట్టినమాత్రాన మేలిగుణము
నేఁడు నీ కేల గల్గునో నీరజారి
నీటఁ బుట్టినవాఁడు కాఁడోటు వహ్ని
గాల్చుచున్నాఁడు జగ మెల్లఁ గరుణ లేక.

రచయిత :

'కాశ్యపి'

చంద్రుడు తారామనోహరుడని, —గురువుగారికి పంగనామం పెట్టిన ప్రముఖుడు లెండి, —ఓషధీనాధుడని, కామకేళీ ప్రోత్సాహకుడని, సుధాకరుడని తెగపొగుడుతారు. తారాకాంతుడే కాక సర్వవనితా హృదయాధినాధుడని కొందరి నమ్మకం. (అయితే దీనికి ఆధారాలు లేకపోలేదు.) ఋతుకారకుడు చంద్రుడేనని బహుజనుల విశ్వాసం.

అయితే చంద్రుడు ఎవడు అన్నది ఒక ప్రశ్న.

ఆ చంద్రుడూ, ఆదిశక్తి భిన్న వ్యక్తులు కారనీ ఒకేవ్యక్తి అనీ, ఈ మానవ ప్రపంచానికి మృత్యుదేవతను ప్రసాదించిన ప్రభువు చంద్రుడేనని చాలా మత గ్రంథములలో ఆధారాలు దొరుకుతవి.

అసలు ఆడామ్, ఈవ్ అని యింగ్లీషులోని పురాణ దంపతులలో ఈవ్‌కి 'చావా' అని పేరు అనగా 'గుండ్రని' అని అర్థం. అంటే చంద్రుడు గుండ్రనివాడు కనుక చంద్రుడే ఈవ్ అయివుంటాడని సిద్ధాంతం.

ఈ తాతకి కోపంవస్తే తట్టుకోడం కష్టం. అందుకనే ఆదిమకాలంలో అమావాస్యనాడు ఏ పని చేయడానికి ప్రజలు సాహసించే వారు కాదు. దానికి కారణం చంద్రుడు ఆ రోజున జబ్బుగా వున్నాడని, కాగా ఏంచేసినా విసుపుచే కోపగించి అరిష్టం తీసుకొస్తాడనీ ఒక విశ్వాసం.

మన దేశంలో పాడ్యమినాడు చంద్రరేఖను చూచి పాత గుడ్డపోగులు అతనివైపు విసిరి దణ్ణం పెట్టినట్టుగా, 'బుష్‌మన్' అనే జాతివారు యిసుకను ఎత్తి అతనివైపు విసిరి గట్టిగా అరుస్తారు. తద్వారా ఆ బాల సుధాకరుని ఆవరించియున్న పిశాచగణం తొలగిపోతుందని వారి నమ్మకం. అసలే కోతి దానికి తేలు కుడితే చెప్పాలా? అలాగే చంద్రుడే స్వతహాగా ప్రజలను కాముకులుగా చేసి వారి జీవితాలను హరిస్తాడు. అలాంటి వానికి పిశాచగణం తోడైయుంటే ప్రజలను అమాంతంగా విచ్ఛిన్నం చేయడూ?

'మాసై' జాతివారు పాడ్యమినాడు ఎడంచేత్తో చంద్రునివైపు రాళ్ళురువ్వుతారు, 'జులూసు' అనే వారు బాజాలు వాయిస్తారు. యివన్నీ కూడా చంద్రుని అనుసరించే పిశాచగణాన్ని పారద్రోలటానికే.

చంద్రకిరణాలు యింట్లో పడటానికూడా భయపడేవారున్నారు. అట్టి వారిలో చేరినవారే బుష్‌మన్ నిగిరియాలోని జుకన్‌లును.

చంద్రుడు పదునారు కళలతో నిండియున్న పౌర్ణమినాడు కూడా అతడు ప్రమాదములు కలుగజేస్తాడని కొందరి నమ్మకం. అంటే ఆ రోజున మదించి వుంటాడు. ఆ గురుద్రోహికి ఆ రోజు కన్నూ మిన్నూ కనుపించదు. అందుకనే జబ్బుగానున్న వారికి అమావాస్య

పూర్ణిమలు గడ్డు రోజు లంటారు. అందులో స్త్రీలకు మరీ ప్రమాదం.

మృత్యుకారకుడైన చంద్రుని నయాన్న జయించాలనే భావంతో అతన్ని ఆరాధించడం మొదలు పెట్టారు ప్రజానీకం. కనుకనే, దుష్టుణ్ని యింద్రుడువి, చంద్రుడువి అని స్తుతించడం మామూలు.

సూర్యుని ఆరాధన విరివిగా వున్నా వ్యవసాయం అభివృద్ధి అయినకొద్దీ చంద్రుని ప్రతిష్ట అభివృద్ధియై అతని ఆరాధన ఘనమైనది.

చంద్రుడు సూర్యుడు సమాన తేజోవంతులై వుండేవారట ఒకసారి వారిద్దరు దొమ్ములాడారు. అందులో సూర్యుడు చంద్రుణ్ని గాయపరిచాడనీ, ఆరోజు మొదలు చంద్రుని కాంతితగ్గి వెలవెల పోయాడనీ మెతసిన్ ల నమ్మకం.

అమెరికా ఆదిమవాసులలో చంద్రుని ఆరాధన అపరిమితంగా జరిగేది.

మనలో కూడా కార్తీక పౌర్ణిమ, శ్రావణాల పున్నమ, కోర్ల పౌర్ణిమ, మొదలైన పర్వదినాల్లో యీచంద్రారాధన జరుగుతూ వుంటుంది.

స్త్రీలు ఋతుమతు లవడానికి కారణభూతుడు తారా మనోహరుడు. సరిగా యీ ఋతు దర్శనం నెలనెలకు జరుగుట కూడా చంద్రుని గతులనుబట్టే వుంటుందని పెద్దల అభిప్రాయం. అసలు పుష్పవతులు కావడానికి కారణం చంద్రుని సంపర్కమనే అంటారు.

ప్రతిస్త్రీకి చంద్రుడు కూడా ఒక ... మగడనే విశ్వాసం చాలామందికి వుంది. అంటే స్త్రీలందరూ తారలే!

'ముర్రే' దీవులలోని వారికి 'చంద్రుడు ఒకయువకుడనీ, అతడు చేసిన బలవంతంవల్లనే కన్యలకు స్త్రీలకు రజోదర్శనం అవుతుందని' నమ్మకం. పాపూను అనే జాతివారికి కూడా ఇట్టి నమ్మకం కలదు.

ఒక ఋతువిధానమే కాక ఆమెలో కలుగు యితర మార్పులకు కూడా కర్త చంద్రుడే. స్త్రీకళాస్థానం చంద్రుని గతులనుపట్టే వుంటుందని కామశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. పిండోత్పత్తికి కూడా చంద్రకళలే కారణభూతములు. అతడే అధిష్ఠానదేవత.

పెళ్ళికాలమందే సోముడు నిన్ను స్వీకరిస్తున్నాడు అని పెళ్ళికుమారునిచే అనిపిస్తారు అంటే మొదటి మొగుడు చంద్రుడే అన్నమాట.

ఏనాహట్లీ అనే జాతివారు తమ సంతానాలకు చంద్రుడే తండ్రి అని నమ్ముతారు. ఎస్కిమో జాతికి 'రాత్రులందు చంద్రుడు తమ భార్యలతో సంభోగించి పోతాడని' నమ్మకం. ఆజాతిలోని కన్యలు చంద్రుని కేసి చూడడానికే సిగ్గుపడతారు దర్శన మాత్రాన సద్యోగర్భం కలుగుతుందని భీతి.

వాన్ కోవర్ దీవులలోని నుటక్కా యిండియనులలో నాయకుడు పౌర్ణమినాడు వెన్నెట్లోనే భార్యతో భోగించాలి యితర సమయములందు ముట్టరాదు.

క్షీణచంద్రునిలో వివాహం జరగడానికి మనవారు మనశాస్త్రములు ఎట్లా వప్పుకొనవో టెక్సాసులోని యిండియన్ జాతులుకూడా ఆ విషయమును పాటిస్తాయి. పెండ్లిఅయిన వెంటనే చంద్రకిరణములచే పునీతం చేయబడిన నీటితో అభ్యంగనం చేయిస్తారు. ఆకాశమున చంద్రుడు లేనిదే పెండ్లి చేయరు. రాజమహా కొండలలోని సౌరియ జాతీయులు. అందువల్లనే తెల్లవారుజాము ముహూర్తం మంచిదంటారు క్షీణచంద్రుల్లో కాని చంద్రుడు లేకండా కాని జరిగితే ఆదంపతులకు పిల్లలు పుట్టరని వారి గాఢ నమ్మకం.

నైలునద ప్రాంతీయులు ఆకాశంలో చంద్రుడు వుండగా గర్భిణీ స్త్రీ సంగమంచేయరు. అంటే చంద్రదర్శనం అవుతున్నంతకాలం తమ భార్యలతో చంద్రుడు సంగమిస్తున్నాడని వారి నమ్మిక. చంద్రుడు పోగానే వారు క్రీడిస్తారు. పిండాభివృద్ధికి నిత్యసంగమం అత్యావశ్యకమని వారి నమ్మకం. వికోయి జాతి

స్త్రీలు వెన్నెట్లో తిరక్కపోతే సంతానం కలుగదని తలుస్తారు. చంద్రకిరణములు పడిన ఉదకం త్రాగితే తప్పక గర్భం కలుగుతుందని యూరప్పులోనివారు చాలమంది విశ్వసిస్తారు.

బ్రిటాని స్త్రీలు ఎన్నడూ దిగంబరులై చంద్రునికి కనుపించరు చంద్రుడు మగాడు కనుక. చూడండి దిగంబరులుగూడా సూర్యకిరణాలలో వాల్లాడుతున్నారు కాని చంద్రకిరణాల్లో తిరగరు. దిగంబరులుగా చంద్రుని చూచుటవల్ల గర్భం ప్రాప్తిస్తుందని వారిభయం. అంతేకాదు అట్టి స్థితిలో పుట్టిన వ్యక్తి పిచ్చివాడవుతాడని వారి నమ్మకం గర్భిణీస్త్రీలు వెన్నెలలో దిగంబరులై తిరిగితే వారికి పుట్టేవారు సర్వసాధారణంగా పిచ్చివారై వుంటారని తలుస్తారు జర్మనీవారు.

చంద్రుని కళాకళలనుబట్టి ఆ పుట్టే బాలబాలికల భావి నిర్ణయమౌతుంది. నిండుచంద్రునిలో గర్భవతి అయితే మగశిశువుని క్షీణచంద్రునిలో అయితే ఆడశిశువుని ప్రసవిస్తుంది.

స్కాట్లాండులో కన్యలు సర్వసాధారణంగా పౌర్ణమికు ముందు రోజులలోనే వివాహం చేసుకుంటారు. అందుకే 'హనీమూన్' అని పేరు వచ్చివుండాలి—వారు భర్తతో గడిపే ప్రథమ దినాలు. పౌర్ణమినాడు ప్రసవించినవారు సుఖంగా ప్రసవిస్తారు. ఆ నాడు ఓషధులన్నికూడా పూర్ణమైన గుణములు కలిగివుంటాయి. తేనెటీగలు తమ పట్టునందుకూడా ఆరోజున తేనెను పూర్తిగా నింపయుంటాయి. చంద్రునిలోని కళంకుకూడా నిండి వుంటాయి. ఈ అమృతకరుడు తన వద్దనున్న అమృతం పాడ్యమి మొదలు పంచిపెడతాడని ఒకనమ్మకం.

గర్భంలో పెరిగే పిండానికి చంద్రునకు అవినాభావ సంబంధం వుంది. ఈ నియమం అన్ని దేశము

విజ్ఞానవిషయాలు

సముద్రాల విస్తీర్ణం:

పసిఫిక్ మహాసముద్రం 78,000,000 చతురపుమైళ్లు, అట్లాంటిక్ మహాసముద్రం 25,000,000 చతురపుమైళ్లు, హిందూమహాసముద్రం 14,000,000 చతురపుమైళ్లు, దక్షిణమహాసముద్రం 25,000,000 చతురపుమైళ్లు, ఉత్తర మహాసముద్రం 5,000,000 చతురపు మైళ్లు, మధ్యధరాసముద్రం 1,000,000 చతురపుమైళ్లు, నల్లసముద్రం 170,000 చతురపు మైళ్లు, బాల్టిక్ సముద్రం 165,000 చతురపుమైళ్లు, ఉత్తరసముద్రం 160,000 చతురపుమైళ్లు వున్నట్లు అంచనా వేయబడింది.

* * *

ప్రపంచంలో ముఖ్యనదుల పొడవు.

దక్షిణ అమెరికాలోని అమజాన్ నది నిడివి 4700 మైళ్ళు.

ఉత్తర అమెరికాలోని మిస్సిసిపి మిస్సోరినది 4400 మైళ్ళు.

చైనాలోని యాన్‌టిజ్‌కియాన్గ్ 2980 మైళ్ళు.

హొనాహో 2620 మైళ్ళు.

ఆఫ్రికాలోని నైలునది 3000 మైళ్ళు.

రైయోడిలాప్లాటోనది 2500 మైళ్లు,

వోల్గానది 2035 మైళ్ళు.

ఏషియాలోని యూఫ్రిటీస్ నది 1800 మైళ్ళు.

యూరపులోని డాన్యూబ్ నది 1760 మైళ్ళు.

ఇండియాలోని సింధునది 1650 మైళ్ళు.

గంగానది 1550 మైళ్ళు.

ఆంధ్రదేశంలోని గోదావరి 900 మైళ్ళు.

యుక్రేనియాలోని డెనిపర్ నది 1240 మైళ్ళు.

రష్యాలోని ఒరినోకో 1480 మైళ్లు.

* * *

నారింజచెట్టు:

అన్ని వృక్షాల్లోకి నారింజజాతిచెట్టు చాలాకాలం బ్రతికివుంటుంది. సుమారు 300 ఏండ్లు వుంటుందని కనిపెట్టారు శాస్త్రకారులు. అందులో నూరేండ్లు విరివిగా కాస్తుంది. ఆచెట్టుకి సంరక్షణ లేకపోయినా కాస్తుంది.

అయిదేండ్లనుంచి కాపు ప్రారంభిస్తుంది. మూడోయేటే మొదట పూత పూస్తుందికాని అది నిలవదు.

కాపుకాయడం ప్రారంభించాక అట్టే పెరగదు. పదిఏండ్లనాటికి పెరగడం పూర్తి అవుతుంది. ఆపైని యిక పెరగదు—

లందూ వుంది. అందువల్లనే గ్రహణంనాడు గర్భిణీస్త్రీలు కదలకండా పడుకుంటారు.

చంద్రుడు ఆడవాళ్ళందరకు మగడు కనుకనే తారకి బుధుని పుట్టించినా దోషంలేదని తేల్చారు దేవతలు. ఇది తెలిసే వేమన్న లంజ కాని దెవరు లోకమం దన్నాడు.

తల్లులు చంటిపిల్లలకు చంద్రుని చూపించి దాయిదాయి అనటం లోకవిదితము. ఇది ఒక్క మనదేశంలోనే కాదు, ఆఫ్రికాలో, న్యూగయానాలో, ఏషియామైనర్‌లో, ఉత్తర అమెరికాలోకూడా యీ ఆచారంవుంది. అట్లా వెన్నెట్లో ఆడించడంవల్ల ఆ బాలకుని అభివృద్ధికి దోహదం చేస్తుందని వుద్దేశం.

కేమరూన్‌సులోని యిసుబు జాతీయులు నిండుచంద్రుడు వున్న రోజుల్లో గర్భిణీగా వుంటే వారికి పుట్టిన పిల్లలకు చంద్రుడు తండ్రి అని చెబుతారు. మనకిమల్లెనే అమెరికాలో చంద్రుణ్ణి పిల్లలు చందమామని (అంకుల్) అని పిలుస్తారు. దక్షిణ అమెరికాలోని కాఫీర్సు యిదిగో నీబిడ్డఅని తమ సంతానమును చంద్రునకు చూపిస్తారు. ఇట్టి సాంప్రదాయం యూరపులో కూడా వున్నది.

జలమే పిండోత్పత్తికి కారణం. ప్రపంచములోని నీరంతా చంద్రునివల్ల ఉద్భవిస్తోందనీ, అతడే దానికి సర్వాధికారి అనీ శాస్త్రములు ఘోషిస్తున్నవి.

రెండవది గర్భోత్పత్తికి దోహదంచేసేవి పువ్వులు. అందుకే మన పువ్వుబోడులు గర్భాదానంనాడు ఎన్నిపువ్వులైనా చాలకండా పాన్పు అమరుస్తారు. అన్నిపువ్వుల్లోకి కుముదము గొప్పది. అందుకనే చంద్రుని కుముదపతి అంటారు.

హిందువులు శాస్త్రాలలో చంద్రుడు పురుషుడని సూర్యుడు స్త్రీ అని వున్నట్టు తెలుస్తోంది. మొత్తంమీద చంద్రుడు పురుషుడనీ మొనగాడు కనుకే 27గురుని కట్టుకున్నాడు అని అంటారు.

తియ్యనివాని దగ్గరకి ఎవరైనా చేరతారుకాని రుసరుసలాడే వాని పజ్జ ఎవరికి కావాలి. ఈ పోకిరీ వానికో మచ్చవుంది.

చంద్రబింబములో గోచరించే ఆ మచ్చని అనేకమంది అనేక విధాలుగా భావిస్తున్నారు.

ఇంతమంది భూలోకతారలను చెరుపుతూవుంటే ఎంత అమృతకరుడైతేమాత్రం ఎంత లక్ష్మీ సోదరుడైతేమాత్రం వళ్ళు చెడకండావుంటుందా. కనపడ్డ కన్యనల్లా తారగా చేసేస్తున్నాడు ఈ మామ. అందులోను వెనకాముందూ చూడకండా గురువుగారికే పంగనామంపెట్టిన ప్రముఖుడు సుందరాకారుడుగా వుండాలంటే ఎలా వుండకలడు.

వళ్ళుఅంతా చెడింది. ఏదేనా దారి చూపించమని గురువుగారినే ప్రాధేయపడితే నలుగురి లాంటి దేను తన పెళ్ళాము అనుకుని కనికరంతో పండరిపురంలోని చంద్రభాగ రేవులో మునిగితే పాపంపోతుందని చెప్పాడు. నవయుగ తారలతో కలిస్తే చంద్రుని మచ్చలు మళ్లీపోవు ఎన్ని రేవుల్లో దిగినాసరే. తుదకు కొత్తగోదావరిలో దిగినాసరే. ఆమచ్చా మాసిపోదు.

హాస్యానిగూర్చి అనుభవజ్ఞుల అభిప్రాయం

విజ్ఞానదృష్టిలో చిద్విలాసమే ఒక చమత్కారం.

—జాక్‌గ్విల్.

హాస్యము హృదయాన్ని రంజింప జేస్తుంది.

—డగ్లస్ జెరాల్డు.

సుహృదయతకు ఒక చిహ్నము చమత్కారము.

—కార్లైలు.

హాస్యం పరిహాసంలోవున్న ప్రమాదాలను గంభీరంగా కప్పిపుచ్చేస్తుంది.

—జాన్ వెల్‌సు.

తమను తప్పించి యితరులకు జరిగే అవమానాలన్నీ హాస్యాస్పదంగానే వుంటాయి ప్రతీవానికీ.

—విల్ రోగర్సు.

హాస్యరసం జీవితవాహినిపై నురుగు.

—బ్ర్యాన్ చైరన్సుఫాదర్.

హాస్యంగావుండడంకూడా ఒక విధమైన వేదాంతమును గ్రహించడమే.

—ఆన్‌డ్రీమార్సి.

నిత్యసంతోషికి బీదతనమేలేదు.

—రైమానడ్ హిట్‌కాల్.

ప్రపంచంయొక్క ఆశయమే హాస్యరసాస్వాదనం.

—డేవిడ్ గ్రేసన్.

"నేను కేవలం ఒక నౌకర్ని"

నౌకరు నాగన్న హృదయారాటం,
కమల స్వార్థం, రామారావు అమాయు
కత, శాయి సంబరం యీ చిన్నకథలో
బహుసొంపుగా చిత్రింపబడ్డాయి—

రచయిత:

జనస్వామి కోదండరామశాస్త్రి.

కమల చేతుల్లోని చంటిబిడ్డ అమితో త్సాహంతో, జిలిబిలి నవ్వులతో, గులా బీరేకుల్లాటి ఆచిన్ని హస్తాలనుజాస్తూ, ఆ ఎఱ్ఱని లేత పెదవులను భోసొంపుగా కదిలిస్తో నౌకరి నాగన్నవైపుకు దూకు టారంభించాడు. 'అరి...అప్పుడే...అ ప్పుడే' అని పకపకా నవ్వుతో వెనక్కు లాక్కొంటోన్న తనతల్లిని వాడేమీ లక్ష్యపెట్టుటలేదు.

ఎంత కఠిన హృదయాన్నయినా చం టిబిడ్డ జిలిబిలినవ్వులు కొంచెంసేపు స్వ ర్గానందపు స్వప్నమపోథంలో వూరేగిస్తా యి. యుగయుగాలుగా ఈ మానవ సంఘర్షణలనూ, అనూయల్నీ, భరిస్తోన్న భూదేవికి వెక్కిరింపులా అన్నట్లుం టాయి. నాగన్నలో ఏమూలనుంచో వా త్సల్య వాహిని పొంగి పొర్లి వాని హృద యస్థానమును తాకింది. ఆజిలిబిలి నవ్వు లు వాని మేధస్సులో ముద్రాంకితము లయినాయి. ఆబాలానందపు మల్లె సౌర భం మరుద్దామన్నా మరపుకు రాదేమో?

జీవితంలో అంతవరకూ చవిజూచి యుండని నూత్నానందంతో వాని శరీ రం తూలిపోతోండగా ... కండ్లనుంచి ఆనందభాష్పములు వర్షిస్తోండగా...ఆ సుఖానుభవంలో మునిగి తేలుతూ తనను తానే తెలిసికోలేని పరిస్థితిలో...నా గన్న హస్తములు...గబగబా వురకలు వేస్తో అంతకంతకు ముందుకు సాగివస్తో న్న ఆచిన్ని చేతులవైపుకు దుమికి నాయి.

ఆహ్వానం అందినవెంటనే ఆపసిబిడ్డ నాగన్నచేతుల్లోకి వురికాడు. తనవక్షా నికి గట్టిగా అదుముకుని నవ్వుతూ చం కలో యిరికించుకున్నాడునాగన్న. పసి బిడ్డ, తల్లివంక ఆనందంగా, గర్వంగా, చూచాడు.

డస్కులో రికార్డు సర్దుకోవడం పూర్తి అయినతర్వాత, సిజర్ సిగిరెట్ వెలిగిస్తో నాగన్నవైపుకు తిరిగి 'ఏమోయ్? మా ట్లాడవేం? జీతం ఎంత యిమ్మంటావ్?' అని అడిగాడు.

కమల వెంటనే అందుకుని అన్నది చిరునవ్వుతో 'మన శాయికిగూడానచ్చా డండోయ్' అని.

నౌకర్లకది చాలా గిరాకీసమయం. చాలామంది వరికోతలకు వెళ్లారు. ఒక్క నాగన్నే ఖాళీగావున్నాడు. ఇంజినీర్ కభురుచెప్పగానే, మాసానికి పదిరూపా యలకు తక్కువ అడక్కూడదనుకున్నా డు. ఓ అయిదునిముసముల క్రితము వఱ కూ అదే నిశ్చయంతో ఉన్నాడు.

కాని ఆ పసిబిడ్డను చూచేసరికి... తనకు తానై లభిస్తోన్న ఆసుందర అమృ తపాత్రను ఎట్లు కాలదన్నగలడు...మస్తి పండి రూపాయలకోసరం.

'మీదయ బాబూ......' అన్నాడు నాగన్న తనముఖంపై గులాబీరేకులవలె పాకుతోన్న ఆలేత హస్తాల్ని తీసి ముద్దా డుకుంటూ.

'సరే! ఆరురూపాయలకు కుదురు.'

నాగన్న తలవూపుతూ అంగీకారా న్ని తెలిపాడు.

* * *

ఇంజినీర్ రామారావుగారింట్లో నాగ న్న నౌకరికి కుదిరి నాలుగుమాసములైనది. ఇంజినీర్ తొలిబిడ్డ పదిమాసముల వయస్సుగల శాయిని ఎత్తుకోవడమూ, వానిని బుజ్జగిస్తూ, ఆడిస్తోండడమూ నా గన్నపని.

ఆ నవదంపతుల ప్రణయతోటలో పండిన మధురఫలం ముద్దులబిడ్డ శాయి. రెండు లలితవాహినులు రాముకుని పొంగి పొరలినపుడు చీలిన సెలయేటి కాల్వ ఆసుందరవిగ్రహం. ఆ తల్లితండ్రుల ప్రణ యజీవితం ధన్యమైందనడానికి స్థిరమైన ఆనవాలు !!!

దుష్టవాయువులతో మిళితమైన యీ ప్రపంచస్పర్శ తన సహజస్వరూపంతో, అపసి హృదయంలోకి తొంగిచూడలేదు ఇప్పటివరకూ, ఇంకా ఆ స్వర్గసీమల రసానుభవాన్నే స్మరించుకుంటూ అప్పుడుతప్ప యికముందు లభించని ఆ తలపుల సువాసనల్లో తన్మయుమై సంతోష జలధిలో యీదుతో నేవున్నదేమో ఆ అంతరాత్మ.

'ఏమిరోయ్ మీ వెధవ ప్రపంచం'

అన్నట్లు అమిత నిర్లక్ష్యాన్ని సూచించే జిలిబిలి చిరునవ్వులు...... ఆకాశం నుంచి పొరబాటున పూడిపడిన బాల భాను కిరణమా అనిపించే... కాంతులీనే ఆనున్నని కోమలముఖంలో తొణికిసలాడుతోన్న... బ్రహ్మవర్చస్సు ... మహాతపస్వి ముఖమండలమందలి పవిత్రజ్యోత్స్న...శాంతిదేవత చిరుతర హస్తాలలో వూగుతూ మైమరచి ఆనందిస్తో ఆ బుల్లి హృదయం. ఈప్రపంచం ఏమన్నా అయిపోనీ... కొండలు విరిగిపోనీ... వారధులు పొర్లిపోనీ... అగ్ని వర్షాలలో మాడిపోనీ...దశదిశాంతరములు అదిరిపోనీ ... ప్రళయాగ్నిలో కాలిపోనీ... నాకేం? నేను శాంతిగీతాలను పాడుకుంటూను...అన్నట్లు నిర్లక్ష్యంగా... ధీమాగా...వికసించిన మల్లెపూవుల్లాటి ఆ విశాల నేత్రాల్లలో చిలుకుతోన్న... అమాయకత ... వేరే లోకాలతో సంభంధాన్ని సూచించే ఆ 'అమాయకత్వం ....అదే మానవునికి పరలోక భిక్షు. వయసు పెరిగినకొద్దీ మానవహృదయంలోకి అసూయా, అహంభావం... స్వార్థం, కోపం ఇవన్నీ చేరి దాన్ని శిధిలపరుస్తాయి.

రోజూ పగలు అడపాదడపా, పాలకు ఏ అరగంటో తల్లిదగ్గఱతప్ప మిగతా అప్పుడంతా నాగన్న చంకలో నే వుండే వాడు శాయి. అథవా, కొంచెంసేపు ఆలస్యమైనదంటే, ఎవరో కొట్టినట్లు పెద పెట్టున ఏడుపూ.

నాగన్న చంకలోకి తీసుకోగానే అంత ఏడుపూ ఒక్కపట్టున మానేసి, ఒక సామ్రాజ్యాధిపతి అయినట్లు కులుకుతూ, అదోవిధమైన హోదాతో... తల్లివంక చూస్తూ ముసిముసి నవ్వులు చిమ్మేవాడు. ఆ ఎత్తుకున్నంతసేపూ నాగన్నకూడా ఒకపసిబిడ్డయై శాయితో ఆడుకునేవాడు. వాడు నవ్వినట్లు నవ్వేవాడు. భాషలేని ఆచంటిబిడ్డ అవసరాలను వాని ముఖభావములనుబట్టి తెల్సుకునేవాడు. ముద్దులొలికే ఆచిన్ని నేత్రాలు, చూపులతో ఏమిటేమిటో మాట్లాడేవి నాగన్న హృదయంతో.

తల్లిదగ్గఱ వుండి ఎంత గుక్కపెడుతున్నాసరే 'నాగన్నా'అని పిలవగానే ఏడుపు తగ్గించి సంతోషంగా నల్లగ్రుడ్లను ప్రక్కలకు త్రిప్పతూ అటువైపు చూచేవాడు శాయి.

నిజంగా నాగన్నవస్తే, ఎత్తుకోమన్నట్లుగా, కాళ్ళూ చేతులూ నేలకేసి కొట్టేవాడు.

శాయి ఏడుపు వినిపించగానే, నాగన్నకు శరీరమంతా మంటలు పుట్టినట్లయ్యేది, వెంటనే గబగబా ఆదుర్దాగా వచ్చి శాయిని చేతిలోకి తీసుకుని బుజ్జగించి మరుక్షణంలో నవ్వించేవాడు.

ఆపసివాడి బోసినోటి నవ్వుల కిలకిలలు నవ వసంత పిక శాబకకలరుతాలకు ప్రతిబింబంలా అనిపించేవి. ఆకాళ్ల చేతుల కదలికలు, గాలితఱగలకు చిరుగంతులువేసే తమ్మిరేకులను స్ఫురణకు తెచ్చేవి నాగన్నకు .... ఆ 'ఊఁ... ఆఁ...లలో ఏవేవో విపంచి స్వరాలుధ్వనిస్తోన్నట్లుగాతోచేదివానికి.

రాత్రిసమయాల్లో నాగన్న, ఒంటరిగా తన నిట్టాడి గుడిసెలో పడుకుని చిన్నబాబుని యీకాసేపుకూడా నాదగ్గఱ వుండనీయకూడదూ?' అని అనుకునేవాడు. ఒక్కొక్కరాత్రి అసలు వాడికి నిద్రవుండేదేకాదు. 'చిన్నబాబూ, చిన్నబాబూ?' అని స్మరించుకుంటూ, ఇల్లంతా తిరుగుతూ, ఏ తెల్లవార్ఝామున నాలుగుగంటలకో, కోడికూత వినిపించినాక, తన అవివేకాన్ని గుర్తించి కొంచెం విచారపడుతూ 'ఆఁ, ఆశ్రమేకాని. నాదేముంది? 'నేను కేవలం ఒక నౌకరిని' అని అనుకుంటూ సగం శిధిలమైపోయిన నులక కుక్కిలో నడుము వాల్చేవాడు.

* * *

శాయి వయస్సు నాలుగు వసంతాల్ని గడిపింది.

నాగన్నలోని వాత్సల్యం ఇప్పుడు ఒక ఆకారాన్ని పొందింది. వాని జీవితంలో శాయి ఒక అంతర్భాగమైపోయాడు. నాగన్న, సాయంత్రసమయాల్లో కొంచెం చల్లపడగానే శాయిని పూలతోటల్లోకీ, కొండ లోయల్ని తొలుచుకుని పొంగి వస్తోన్న సెలయేటివద్దకూ, పెరిగివున్న వరిపొలాలలోకీ తీసుకుని వెళ్ళేవాడు. ఆమనోహర ప్రకృతి దృశ్యాల్నిగురించి చక్కని భాషలో శాయి బాల్యహృదయానికి అతుక్కునిపోయేలాగు కథలు చెపుతూండేవాడు.

సాయంత్రం నాలుగయ్యేసరికి ఇస్త్రీ దుస్తులుధరించి, ఆచిన్ని క్రాఫింగ్ జుత్తును సరిదిద్దుకుని, కనుబొమ్మలమధ్యకు కొంచెంపైగా చక్కగా చుక్క

పెట్టుకుని.... వరండాలో నాగన్న కోసరం ఎదురుచూస్తో కూర్చోవడం... నాగన్నరాగానే వానివెంటవెళ్ళి పోవడమూ... ఇక తల్లి ఎంతపిల్చినా అంతే? తండ్రి ఎంతపిల్చినా అంతే?

కమలకు తిరిగి సంతానంలేదు. శాయివల్ల తాను పొందాల్సిన ఒక అమూల్యమైన ఆనందాన్ని నాగన్న కాజేస్తోన్నాడని అనుకుంది కమల అసూయతో, అమితకోపంతో, ఆమె హృదయం పూగిపోయింది. యీనాగన్న పీడ విరగడైపోవడానికి వెంటనే వుపాయం కనిపెట్టగలిగింది.

స్త్రీబుద్ధిః ప్రళయాంతకః అని పూరికే అన్నారా.

మర్నాటిరాత్రి భర్త క్యాంపునుంచి వచ్చాడు. భోజనం చేస్తోండగా, మాటా మాటా సందర్భంలో కమల యీవిషయాన్ని మహాసొంపైన పద్ధతి కదల్చింది.

'చూశారా మన శాయిసంగతి? అసలు యిల్లుపట్టడంలేదు నౌకరి నాగన్నతో ఎక్కడికో పోతున్నాడు దినం. ఇట్లా అయితే పిల్లవాడు చెడిపోతాడని చాలామంది అంటున్నారు. నౌకరీ వెధవలు కొంచెం వున్నవాళ్ళ పిల్లల్ని మచ్చిక చేసుకుని పెద్దయినతర్వాత ముంచి ఒదిలిపెడతారట. అట్లా అనేకచోట్ల జరిగిందట.... ఇక మనింట్లో నౌకరి మానెయ్యమని చెప్పండి.'

'ఆఁ. పాపం. వాడుచాలా మంచివాడు. మానెయ్యమనడం ఎందుకులే.'

'బాగానేవుంది.'

ఇంతలో శాయి ఏదో వెర్రి ఆనందంలో గంతులువేస్తో లోపలకు పరుగెత్తుకుని వచ్చాడు.

'బాబూ యింత ప్రొద్దుపోయినదాకా ఎక్కడకు వెళ్లావ్?' అని అడిగాడు రామారావు.

'నేనే.. నేను... నేనూ, నాగన్నా కొండ ఎక్కాం నాన్నగారు.'

'చూశారా ఆతీరు? నాలుగేళ్ళ పిల్లవాడిని కొండలమీదకు తీసుకెళ్ళడం ఎందుకు చెప్పండీ? అక్కడ కూర్చోపెట్టి 'అమ్మమాట వినొద్దు. నాన్నమాట వినొద్దు. వాళ్లు చూడాకుండా ఇంట్లోనుంచి డబ్బులు తీసుకునిరా' అని యిటువంటిమాటలు చెప్పడమూ?'

'ఆఁ.. ఆఁ.... నాగన్న అట్లా చెప్పడంలేదే అమ్మా.....'

'నోరుముయ్. వెధవా. పైగావాడు చెప్పినట్లల్లా చేస్తో.....' అని గర్జించింది కమల ఆమె తత్వం కనుక్కోలేక తల్లడపడుతున్నాడు రామారావు. భోజనం పూర్తిచేసుకుని చికాకుపడుతూ వరండాలోకి వెళ్ళాడు. నాగన్న అక్కడే కూర్చొని వున్నాడు. జీతం లెక్కచూచి పదిరూపాయల కాగితం వానిపైకి విసురుతూ 'నాగన్నా? మాకు ఇక నౌకరు అనవసరమోయ్. శాయి కొంచెం పెద్దవాడైనాడుకదా ? యింకెందుకులే. రేపటినుంచీ మానెయ్యి' అని అన్నాడు ఇంజినీర్. నాగన్నకు మీద పిడుగుపడినట్లయింది. గద్గద కంఠస్వరంతో 'బాబూ?.. ఇకనుంచీ జీతంఒద్దులెండి. చిన్నబాబుకు సేవచేస్తూవుంటాను.' అన్నాడు నాగన్న. రామారావు మనసులో కమల నాటిన విషబీజాలు మొలకలెత్తినాయి. నాగన్న హృదయవేదన రామారావు కనిపెట్టలేకపోయాడు. జీతంకూడా అక్కర్లేకుండా శాయికి సేవచేస్తాననడంలో

నాగన్న కేదో స్వార్థం వుండితీరాలను కున్నాడతను.

'వీల్లేదు. నాగన్నా.' అన్నాడు కటువుగా.

నాగన్నకళ్ళల్లో గిర్రున నీళ్ళుతిరిగాయి......నాగన్న గుమ్మందాటి వెళ్ళిపోతోండగా, దొడ్డివాకిట్లోనుంచి పను వెత్తుకుంటూ వచ్చాడు శాయి.

'నాగన్నా? ఎక్కడికీ? వెళుతున్నావ్? ఇంటికా?'

'ఆఁ.....అవు..కా..కాదు ...ఇక రేపటినుంచీ రాను చిన్నబాబూ....'

'ఏం నాగన్నా?' దిగాలుపడి చూస్తో.

'నాన్నగారు ఒద్దన్నారు.'

వెనుకవైపునుంచి వీస్తోన్న శీతలవాయువులు శాయివీపున అనుకుని లోపలను దించుకుని పోతోన్నాయి.

'నాగన్నా?... మళ్ళీ... మళ్ళీనే...ఎవరింట్లోనా నౌకరీకి కుదరరాదూ.....'

'పిల్లల్ని ఎత్తుకునే నౌకరీ దొరక్కపోదుగాని బాబూ, నీలాంటి...చిన్న అబ్బాయి...నా జీవితంలో యికముందెన్నడు లభించదు చిన్నబాబూ....' నాగన్న నేత్రములనుండి నీటిబొట్లు జలజలమని రాలినై క్రిందకు.

ఆలా ఏడుస్తావేం నాగన్నా?

'ఆఁ నాదేముందీ? నేను కేవలం ఒక నౌకర్ని.' అని అనుకుంటూ, ముడివీడి దట్టముగా ప్రబలివున్న అనంతనిశీథ నిశ్శబ్ద శర్వరీకుంతలములలో పాపడిగీత దిద్దుతూ, ఆమార్గాన్నే వడివడిగా నడిచిపోతున్నాడు ఆనిరాశా హృదయుడు ఎక్కడికో?

ప్రశ్నోత్తరము

"తలదాచుకొనుటకుఁ దావులే దెచట
నడచపోయెద వీయనంత మార్గమున
ఎందుండి వచ్చితి వెందుఁబోయెదవు
ఓయి నిరాశ్రయా! ఓ నిరాధార?"

"సకల చరాచర ప్రకట నాటకముఁ
జదువఁగాజాలు రసజ్ఞ పండితుల
నడుగుమా, విషయ సంశయారూఢ చిత్త!
పనికి మాలిన వేయి ప్రశ్నలేమిటికి?
"జలజల ప్రవహించు జాహ్నవీ- పుణ్య
వీచికా గానము వినువారి నడుగు;
భవనాట్యశాలలోఁ బాత్రాభినయముఁ
గావించి తెరచాటుగానున్నవారి;
గంపెడాశలు నీట గల్పినవారి,
భాష్ప స్రవంతిలోఁబడి మున్గువారి,
నడుగుమా, ప్రాంజలివై శూన్యహృదయ!"

"మర్త్య సంస్పర్శ సన్మధువాసరముల
వనలక్ష్మి పులకింపఁ బ్రణయగీతములు
గొంతెత్తిపాడు కోయిల నడుగు
మధిక ప్రసంగ భాగ్యము మాకులేదు"
"మూఁగలై జగములు మురిగిపోయినవి,
వినివిని యుగములు విసిగిపోయినవి;
యేమి ప్రయోజన మీ ప్రశ్నలందు?
అడుగుమా, జన్మాంధ! ఆత్మయేమనునో!"

"అఖిల లోకావళి కాధారమెవఁడు,
అనిరాధారునే నాశ్రయించెదను,
ఇల్లువాకిలిలేక యిందందుఁ దిరిగి
తిరిగిపోయెద సుమీ, చిరధామమునకు
నీలోన నాలోన నిత్యమై వెలుఁగు
సత్య పదార్థమే శరణంబు మనకు!"

—చిర్రావూరి కామేశ్వరరావు, బిఏ. యల్‌టి, బియల్.

కారపు శనగలు

జూన్ మాసం 22-వ తేదీ ఆదివారం నాడు ఉదయం నాలుగుగంటలకు. రష్యామీద దండెత్తుతూ హిట్లరు యీ యుద్ధంలో కూడా భగవంతుడు మనకు సాయం చేస్తాడనే విశ్వాసంతోనే -స్నేహితుని మీద- యుద్ధం ప్రకటించానన్నాడు.

ఆరోజున రాత్రి 2-30 గంటలకు చర్చిల్ మాటాడుతూ హిట్లరుని, నాజీప్రభుత్వాన్ని నాశనంచేయడమే మన సంకల్పం. అందుకునే రష్యాప్రభుత్వవిధానం ఆమోదింపకపోయినా రష్యాప్రజలకు ఈ కష్టకాలంలో సాయంచేయడానికి నిశ్చయించుకొన్నాము. నాజీజమును రూపుమాపడంలో భగవంతుడు మనకు తోడ్పడతాడని విశ్వశిస్తూ వున్నాను అన్నాడు.

ఒకే దేవుణ్ణి యీ యిద్దరు ఆశ్రయిస్తున్నారు. ఇది చూడగా నాకు భారతం ఉద్యోగపర్వంలోని ఒక ఘట్టం జ్ఞాపకంవస్తోంది.

శ్రీకృష్ణమూర్తిని ఆశ్రయించడానికే వెళ్ళారు దుర్యోధనుడు అర్జునుడూ కూడాను. దుర్యోధనుడు ముందు వెళ్ళినా గర్వంకొద్దీ నెత్తిమీద దేవతలా తలదగ్గర కూచున్నాడు. అర్జునుడు పాదాలు ఆశ్రయించాడు. ఆకృష్ణుడు తన సైన్యానంతను దుర్యోధనునికి యిచ్చినా జయం విజయునికే యిచ్చాడు.

అలాగే హిట్లరు ముందుగా భగవంతుని విశ్వసిస్తున్నానని అన్నా దైవభక్తిలో అగ్రగణ్యులైన బ్రిటిష్‌వారికే జయం చేకూరుస్తాడని అనుకోవచ్చు.

అదీగాక దేవుడు రాక్షసులకి వరాలు యిచ్చి, బాగా పెరగనిచ్చి, చంపడం మనపురాణాల్లో చదువుతూనే వున్నాం. అలాగే జరిగేటట్టువుంది ఈ యుద్ధ పరిణామం.

* * *

ఈమధ్య ఆంధ్రులకోస్తావ్యాపారాన్ని స్ఫురణకుతెస్తూ విశాఖపట్టణంలో నౌకానిర్మాణ కేంద్రానికి శంకుస్థాపనజరిగింది.

హైదరాబాదు రాష్ట్రంలోని ప్రస్తుతపు పైతాన్ నగర ప్రాంతంలో జరిగిన పరిశోధనల ఫలితంగా 'పూర్వపు ప్రతిష్ఠానపురం బయలుపడటం, దానితో పూర్వపు ఆంధ్రనాగరికత బయటపడటం ఆనందదాయకమైన విషయాలు.

అయితే యిప్పుడైనా మన ఆంధ్ర సోదర సోదరీమణులు తమకు ఒక ప్రత్యేక నాగరికతా ఘనతా వుందని గ్రహించి తమ అంధత్వాన్ని విడిచిపెట్టి ఆంధ్రరాష్ట్రం ఏర్పరుచుకోడానికి నడుంకడతారా లేక గుజరాతు సరదారులకు గులాములుగానే వుండిపోతారా ?

వాహినీవారి 'దేవత' సమీక్ష

నిన్నటిరోజున సాయంకాలం 5-45 గంటలకు మదరాసు పత్రికా విలేఖరులకు మదరాసులోవున్న ఆంధ్ర తారాగణానికి తదితరులకు వాహినీవారు 'దేవతా' దర్శనం యిప్పించారు.

ఈ దేవతాదర్శనానికి వచ్చిన వారందరకు ముందుగానే ప్రసాదాలు ముట్టాయి కడుపు చల్లబరచుకొని హాయిగా పంకాలు పెట్టుక్కొని కూచున్నారు.

ఈచిత్రానికి దేవతఅని నామకరణం చేయడంలోనే శ్రీ బి. యన్. రెడ్డిగారు చిత్రాలకు ఆకర్షణీయమైన నామకరణంచేయడంలో సిద్ధహస్తులని విశదమైయుంది.

ఈ చిత్రంలో లక్ష్మికి వుండవలసినంత ప్రాముఖ్యత, సన్నివేశాలు కనుపించవు. వేణు వస్తాడంటే సీత చూపిన ఉత్సాహం ఒక ప్రియుడు వస్తూవుంటే ప్రియురాలు చూపేవిగా వున్నాయిగాని చెల్లెలు చేసే చేష్టలవలె లేవు.

మొత్తంమీద సూర్యకుమారి గానం దేవతాగానం లాగే వుంది ప్రేక్షకులను ముగ్ధుల జేస్తోంది.

నాగయ్య, రాజకుమారి, సూర్యకుమారి, రాజరత్నం తమ తమ పాత్రలను బాగానే నిర్వహించారని చెప్పాలి. ఈ చిత్రంలో హృదయానికి హత్తేది ముఖ్యంగా శేషమ్మగారితల్లి పాత్ర. తల్లి అమాయకతను చక్కగా ప్రదర్శించిందామె.

రంగని పాత్ర హృదయరంజకంగావుంది.

శబ్దగ్రహణము, ఛాయాగ్రహణము చక్కగావున్నాయి. తగిన సామరస్యము కూడా ఉంది.

ఇంతవరకు వెలువడిన తెలుగు చిత్రాల్లోకన్నా యీ చిత్రంలో సంగీతం ఉచ్ఛస్థానానికి వచ్చిందని మా నమ్మకం.

ఆంధ్రులకు 'దేవత'ను సమర్పించిన బి. యన్. రెడ్డిగారు యికముందుకూడా తమ కళా కౌశలము విరాజిల్లే మంచి తెలుగు జాతీయ చిత్రాలను తీస్తారని ఆశిస్తున్నాము—

స్వాతంత్ర్యప్రియుడు చర్చిల్

[౯౬౭-వ పేజీ తరువాయి.]

తున్నాను. ఎందుకు పడిపోయారు రైలునుండి' అని అడిగాడా యజమాని. నిజం చెప్పుతుంటారా అన్నాడు చర్చిలు. చెప్పింది నిజమే అని తలుస్తానన్నాడా గృహయజమాని.

చర్చిలు గభాలున లేచి నుంచున్నాడు బల్లమీద సామానులు తృళ్ళిపడ్డాయి. 'నేను విన్‌స్టన్ చర్చిలును, 'మార్నింగు పోస్టు'కి యుద్ధవిలేఖరిని. ప్రిటోరియానుండి తప్పించుకు వస్తున్నాను నాదగ్గర చాలాడబ్బు ఉంది. నీవు నాకు సాయంచేయూ' లని గబగబా చెప్పాడు.

అతడు అదుర్దాగా వెళ్ళి భోజనశాల తలుపుకూడా లోపల ఘడియ వేశాడు. చర్చిలు గుండెలు పీచు పీచు మంటున్నాయి ఏంచేసి పోతాడో అని, ఆశానిరాశలో వూగులాడింది, రక్షించుకోడానికి చేతిలో కూడా ఏదిన్ని ఆయుధం లేదు. కాని అతడు నెమ్మదిగా చర్చిలు దగ్గరకు వచ్చి 'నీవు మాయింటికి వచ్చినందుకు భగవంతుని వేయి విధాల స్తుతిస్తున్నా' నన్నాడు. లేచిపోయిన ప్రాణాలు తేరుకున్నాయి చర్చిలుకి.

ఆగృహ యజమాని అక్కడ బొగ్గుగనుల కంపెనీకి మేనేజరు, అతని పేరు జాన్ హోవార్డు. ఆ ముందు రోజునే బోయరు ప్రభుత్వపు సైనికోద్యోగులువచ్చి అతని గృహం శోధించి పోయారు చర్చిల్‌కొరకు.

ఒకగుడ్డమూ, తనకు ఆహారమూ యిచ్చి తనను పంపివేయమని ప్రార్థించాడు చర్చిలు. దానికి అతడు ఒప్పుకోలేదు.

'తగిన ఏర్పాటు నేను చేస్తాను అంతవరకు నేచెప్పినట్టు చేయ'మన్నాడు హోవర్డు విధిలేక సమ్మతించాడు చర్చిలు.

ఆయజమాని మేకమాంసం ముక్క, విస్కీ మొదలైన పదార్థాలు చర్చిలు ముందుపెట్టి తినమని చెప్పి అతడు దొడ్డితలుపు తీసుకొని బయటకు పోయాడు. అతడు తిరిగి ఒక గంటలో వచ్చాడు. 'అంతా సిద్ధమైంది రా'అన్నాడు.

హోవార్డు తన స్నేహితులతో సంప్రదించి చర్చిలును బొగ్గుగనులో ఉన్న భూగృహంలో దాచివేయడానికి నిశ్చయించుకున్నారు.

బాగా గాలి తగిలే చోట, ఎవరూ చూడని చోట చాపఒకటి ఒక కొవ్వొత్తి, ఒక బాటిల్ విస్కీ ఒక సిగరెట్టుపెట్టి యిచ్చి అక్కడ కూచోమన్నారు. 'రేపు నీకు ఆహారంపంపిస్తాను ఏమి వచ్చినా సరే యిక్కడనుండి కదలవ' ద్దని చెప్పి వెళ్ళిపోయాడు హోవార్డు.

రాబోయే స్వేచ్ఛను కలగంటూ ఆమట్టిలో భూదేవి గర్భంలో ఒంటరిగా నిద్రపోయాడు.

ఎంతసేపు నిద్రపోయాడో అతనికి తెలియదు. మరునాడు లేచేసరికి అపరాహ్ణం తిరిగిపోయింది. ఆ చీకటిలో కొవ్వొత్తికోసం వెదికాడు కనుపించలేదు. చేసేది లేక కదలక మెదలక ఆ చాపమీదే పడుకొని మిడుతూ మిడుతూ చూస్తున్నాడు— భగవంతుని ధ్యానించుకుంటూ.

ఇంతలో హోవర్డు స్వయంగా నే కాల్చిన కోడిపిల్లను యితర ఆహారపదార్థాలు తీసుకొని ప్రత్యక్షమైనాడు. కొన్ని పుస్తకాలుకూడా తీసుకొనివచ్చాడు చర్చిలుకి యివ్వడానికి.

హోవార్డు'చీకటిలో వున్నావే'మని చర్చిలును అడిగాడు. కొవ్వొత్తి కనుపించలేదని సమాధానం చెప్పాడు విన్‌స్టన్. తలక్రింద పెట్టుకోలేదా అని అడిగాడు. లేదంటే ఎలుకలు ఎత్తుకుపోయి వుంటాయి ఇక్కడ ఎలుకలదండులు చాలా వున్నాయి జాగ్రత్త అని చెప్పాడు.

హోవరు ఆకోడిపిల్లను యిరువది మైళ్ళ దూరంలో వున్న మిత్రుని యింటివద్దనుండి తెచ్చానని చెప్పాడు.

ప్రిటోరియా ప్రభుత్వం చర్చిలును పట్టుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. కాగా బోయర్లు ఎవర్నూ యీప్రదేశంలో వెతక్కుండా ఉండటానికిగాను అక్కడ భూతములున్నాయని ప్రచారం చేశారు హోవర్డు స్నేహితులు. అందుచే ఎవరూ ఆవైపు తొంగిచూడడంలేదు. అతడు చర్చిలు భోజనముద్యేవరకు వుండి ఒక అరడజను కొవ్వొత్తులు యిచ్చి ఎలుకలు యీడ్చుకుపోకండా తలక్రిందపెదట్టుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

కొవ్వొత్తులను తలక్రింద పెట్టుకొని నిద్రపోయాడు. మళ్ళీ తిరిగి మెళుకువవచ్చి చూచేసరికి ఎలుకలు కొవ్వొత్తులను లాగుతున్నాయి ఎలుకలతోపోట్లాడుతూ చర్చిలు ఆ భూగృహంలో మూడురోజులు గడిపాడు. ఒకసారి కునికిపాట్లు పడుతోంటే ఒక ఎలుక యీబ్రిటిష్ సింగంమీదనుంచి దూకిందిట కూడా !

మూడురోజులు ఆ బొగ్గు గనుల్లోనే ఉన్నాడు. నాలుగోరోజున హోవర్డువచ్చి దేశంలో ఇతని విషయమై అలజడి కొంచం తగ్గిందని చెప్పాడు. ఆరోజురాత్రి చర్చిలును తనతోకూడా భూగృహంనుంచి పైటకు షికారు తీసుకువచ్చాడు. మరునాటినుంచి హోవర్డు ఆఫీసు వెనకరూములో కూర్చోపెట్టాడు చర్చిలును. పేకేజీపెట్టెల వెనుక భాగంలో దాగి పగటి కాలం గడిపాడు. ఆగదిలో మరి మూడు రోజులు గడిచాయి. రాత్రిలందు హోవర్డుతో మైదానాల్లో తెగ తిరుగుతుండేవాడు.

ఒకరోజున హోవర్డు తాను చర్చిలును తప్పించడానికి వేసిన పన్నాగం అతనికి వివరించాడు.

బర్గనర్ అనేడచ్చివర్తకుడు ఆ గనులకు సమీపంనుంచే 19-వ తేది డిసెంబరున. గొర్రెబొచ్చు రైల్లోవేసి డెలుగోవా బేకి పంపిస్తాడని. ఆరైల్లోనే చర్చిలు దాగి వుండటానికి ఏర్పాటుచేసినట్టు చెప్పాడు.

ఆ ఏర్పాటు ఎట్టిదంటే గొర్రెబొచ్చు బేళ్ళను ట్రక్‌లో అమర్చేటప్పుడు మద్యభాగంలో గూడు మాదిరిగా అమర్చడం అందులో చర్చిలును కూర్చోబెట్టి ఆపైని వొకబరకం వేసి కట్టేస్తే సరిహద్దులోకూడా దానివైపు ఎవరూ తొంగిచూడరని చెప్పాడు.

బొచ్చుబండిలో పడివుండటానికి మొదట్లో చర్చిలుకి మనస్కరించలేదు. 'వొక (పోనీ) గుఱ్ఱమును యిస్తే చాలు, నాదారి నేను చూచుకుంటా నన్నాడు చర్చిలు. కాని సరిహద్దులో పట్టుపడతాడనే భయంచే ఆ విధానం వదలుకుని హోవర్డు చెప్పినట్టు చేయడానికి వొడబడ్డాడు.

ఇది ఇట్లా ఉండగా చర్చిలు పట్టుబడ్డాడని అనేక పుకార్లు పేపర్లలో కనుపించేవి. చర్చిలును పట్టి తెచ్చినవానికి 25 పౌనులు బహుమానమీయబడునని బోయరు ప్రభుత్వ ప్రకటన రైలుపొడుగునా స్టేషన్‌లో అంటించి వుంది గోడల మీద.

19-వ తేదీ తెల్లవారుఝామున 2 గంటలవేళ హోవార్డు వచ్చి చర్చిలును వెంటబెట్టుకు పోయాడు. పిండిఆరబోసినట్టు వెన్నెల వెన్నెట్లో కొంతదూరం నడిచేసరికి మూడు ట్రక్కులు నిలిచి వున్నాయి. మొదటి ట్రక్కులో బేళ్లు పడేస్తున్నారు. హోవర్డు చర్చిలును సరాసరి మూడోట్రక్ వెనుకభాగానికి తీసుకపోయి ఎడంచేత్తో సంజ్ఞచేసాడు బేళ్ళతో నిర్మింపబడిన సొరంగంవైపు. అందులో నుంచి లోపలకు పాకి వెళ్ళాడు చర్చిలు.

మధ్యలో ఆ సొరంగం పెద్దదిగా. కూర్చోడానికి పడుకోడానికి వీలు అయేటట్టు నిర్మింపబడి వుంది. చీకట్లో అక్కడ ఏమి వున్నది కనుపించలేదు. ఫుటుగులాగ అక్కడ కూచున్నాడు.

బాలభాస్కరుని శ్వేత కిరణాలు